**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 90, పేజీలు - 08

మంగళవారం, సెప్టెంబర్ 29, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# 22-ఏ ఎత్తివేస్తే ప్రభుత్వ భూములు మాయం

- నిషేధిత జాబితా తొలగింపుతో భూకబ్జాదారులకు రెక్కలు
- భవిష్యత్ తరాలకు ప్రభుత్వ ఆస్తులు అసలు దక్కవు
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గితే ప్రభుత్వ భూములకు రక్షణ కరువే
- 22-ఏ ఉండగానే భూములను మింగేస్తున్నారు.. తొలగిస్తే ఒక్క అంగుళం కూడా మిగలనివ్వరు
- టీజేఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటీ రామకృష్ణ






గౌటీ రామకృష్ణ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ కల్పించేందుకు అమలులో ఉన్న నిషేధిత జాబితా 22-ఏ ను ఎత్తివేయడం వల్ల ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం (టీజేఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటీ రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములకు రక్షణగా ఉన్న వ్యవస్థను బలహీనపరిస్తే భూకబ్జాదారులకు మరింత అవకాశం కల్పించినట్లవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూములపై కన్నేసిన కొందరు వ్యక్తులు మొదట ఆక్రమణలకు పాల్పడి, అనంతరం వాటిని 100 గజాలలోపు ప్లాట్లుగా విభజించి రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో విక్రయిస్తున్నారనే ఆరోపణలు అనేక ప్రాంతాల్లో వినిపిస్తున్నాయని గౌటీ రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులు, సర్వే నంబర్లు, హక్కులు, వర్గీకరణ వంటి అంశాలను పూర్తిగా పరిశీలించకుండానే నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తే భవిష్యత్‌లో వివాదాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

## 22-ఏ ఉండగానే కబ్జాలు

22-ఏ జాబితా అమల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వ భూములపై ఆక్రమణలు, ప్లాట్లుగా విభజించడం, యదేచ్ఛగా రియల్ ఎస్టేట్ లావాదేవీలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎంతో ముఖ్యమైన 22-ఏ రక్షణను తొలగిస్తే ప్రభుత్వ భూములను గుర్తించడం, తిరిగి స్వాధీనం చేసుకోవడం ఎవరి తరం కాకుండా పోతుందన్నారు. 22-ఏ ఉండగానే ప్రభుత్వ భూములను మింగేస్తున్న కబ్జాదారులు అదే రక్షణను తొలగిస్తే ఒక్క అంగుళం భూమిని కూడా మిగలనివ్వరని గౌటీ రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

## కబ్జాలకు కళ్లెం ఎవరు.?

ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి అని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. భూముల రికార్డుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిదిద్దేందుకు ప్రత్యేక పరిశీలన చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. అలాగే 22-ఏ నుంచి భూములను తొలగించే ముందు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాల రికార్డులను సమగ్రంగా సరిపోల్చాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ భూములపై ఇప్పటికే జరిగిన ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, అనుమానాస్పద లావాదేవీలపై కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యేక విచారణ చేపట్టాలని కోరారు. ప్రభుత్వ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యవహారాలను కూడా అధికారులు బహిర్గతం చేసి వాటిపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటో తెలపాలని ఆయన కోరారు.

## రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు

రాజకీయ నేతల ఒత్తిళ్లకు ప్రభుత్వం తలొగ్గి 22-ఏను ఎత్తివేస్తే అది కేవలం ప్రభుత్వ భూముల సమస్యను అసలు తీర్చదని దానివల్ల ప్రభుత్వ భూమి ఎక్కడ మిగలదని భవిష్యత్ తరాలకు చెందాల్సిన ప్రజా ఆస్తి క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంటుందని గౌటీ రామకృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల విషయంలో ఎలాంటి మినహాయింపులు, సడలింపులు ఇచ్చినా పూర్తి పారదర్శకత పాటించాలని, భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. 22-ఏ తొలగింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే ముందు ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

## ప్రజా ఆస్తుల పరిరక్షణే బాధ్యత

ప్రభుత్వ భూమి ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని, అది ప్రజల ఆస్తి అని గౌటీ రామకృష్ణ స్పష్టం చేశారు. రేపటి తరాలకు చెందాల్సిన భూములను ఈరోజే కబ్జాలు, అక్రమ లావాదేవీలకు గురిచేసే పరిస్థితులు రాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ భూములను గుర్తించి వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. 22-ఏ రక్షణను తొలగించే ఏ నిర్ణయమైనా ప్రజా ప్రయోజనాలు, ప్రభుత్వ ఆస్తుల భద్రత, భవిష్యత్ తరాల హక్కులను దృష్టిలో పెట్టుకుని మాత్రమే ఉండాలని గౌటి రామకృష్ణ స్పష్టం చేశారు.

# యూపీఐ ఛార్జీలపై స్టేకు నిరాకరణ

## - కేంద్రం, ఆర్బీఐలకు సుప్రీం నోటీసులు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై విధించిన మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) ఛార్జీలపై స్టే విధించేందుకు సర్వోన్నత న్యాయస్థానం సోమవారం నిరాకరించింది. అయితే, ఈ విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ)లకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. దేశంలో అత్యంత ఆదరణ పొందిన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ పనితీరును ప్రభావితం చేసే ముఖ్యమైన అంశం ఈ కేసు ప్రత్యేక దృష్టి సారించింది.

2లో..

# అసెంబ్లీ కంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లా

## - 'ది కాంక్లేవ్ 2026'లో సీఎం రేవంత్ రెడ్డి

- స్వతంత్ర అభ్యర్థిగా రాజకీయ అరంగేట్రం చేశానన్న రేవంత్
- తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ సహకరించడం లేదన్న సీఎం
- నిధులు గుజరాత్‌కు మళ్లిస్తున్నారని ఆరోపణ
- ఎస్ఐఆర్‌లో అర్హుల ఓటు హక్కు కాపాడాలన్న రేవంత్ రెడ్డి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**(తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలోని కీలక ఘట్టాలను గుర్తుచేసుకుంటూ ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పారు. ఢిల్లీలో జరిగిన ఓ కాన్‌క్లేవ్‌లో 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అంశంపై మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రాజకీయాల తీరు, తన పార్టీ మార్పు, కేసీఆర్‌తో రాజకీయ పోరాటం, విద్య, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా తాను అసెంబ్లీకి వెళ్లిన దానికంటే ఎక్కువసార్లు జైలుకు వెళ్లానని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

2లో..

# జలవనరులు కలుషితం కాకుండా చూడాలి

## - ఆక్వా వ్యర్థాలపై పవన్ సమీక్ష



2లో..

# అహర్నిశలు మంగళగిరి ప్రజల గురించే ఆలోచిస్తా

- మంగళగిరిలో 'మన ఇల్లు--మన లోకేశ్ 'కార్యక్రమం
- 372 మందికి శాశ్వత ఆస్తి హక్కుల పట్టాల పంపిణీ
- రెండు విడతల్లో 5,636 మందికి పట్టాలిచ్చామన్న లోకేశ్




అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. దశాబ్దాలుగా మంగళగిరి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్యను పరిష్కారిస్తామని ఇచ్చిన హామీ మేరకు అర్హులకు శాశ్వత పట్టాలు పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ శాఖల భూముల్లో ఏళ్లుగా నివశిస్తున్న పేదలకు శాశ్వత హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో మంత్రి నారా లోకేశ్ వారికి పట్టాలు ఇస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా సోమవారం మంగళగిరిలో 372 మందికి శాశ్వత పట్టాల పంపిణీ చేశారు మంత్రి నారా లోకేశ్. మన ఇల్లు - మన లోకేశ్ కార్యక్రమంలో భాగంగా ఈ పట్టాలు అందజేసినట్లు మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

2లో..

# ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ

## - గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి త్వరలో ఉప ఎన్నికలు రానున్నాయి. ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయిందని ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. సెప్టెంబర్ 26నే అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి ఖైరతాబాద్ స్థానంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇటీవల హైకోర్టు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయడం తెలిసిందే. 2024 ఏప్రిల్ నుంచి దానం ఎమ్మెల్యేగా అనర్హుడిగా హైకోర్టు స్పష్టం చేయగా, సుప్రీంకోర్టులోనూ ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఓ పార్టీ గుర్తుపై గెలిచిన వ్యక్తి మరో పార్టీ గుర్తుపై పోటీచేయడంతో అనర్హత వేటు వేసినట్లు కోర్టులు తమ తీర్పులో స్పష్టం చేశాయి.తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న దానంను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది.

2లో..

# వాయు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు

## - ఢిల్లీలో నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా

2లో..

# 110 కోట్లు దాటిన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య

## - ఆగస్టులో 0.61 శాతం వృద్ధిని నమోదు చేసిన టెలికం రంగం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారతదేశ టెలికం రంగం మరోసారి వృద్ధి పథంలో దూసుకెళ్లింది. ఆగస్టు నెలలో బ్రాడ్‌బ్యాండ్, వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) సోమవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా డిజిటల్ సేవలు విస్తరిస్తున్నాయనడానికి ఈ సంఖ్యలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ట్రాయ్ నివేదిక ప్రకారం, ఆగస్టు 2026 చివరి నాటికి దేశంలో బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1,101.21 మిలియన్లకు

2లో..

# రీసర్వేతోనే భూసమస్యలకు చెక్

## - ఇదే భూభారతి లక్ష్యం

- 70 రెవెన్యూ గ్రామాలను తొలి దశలో సర్వేకు ఎంపిక
- సమగ్ర సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం
- ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయాలకు తావులేదు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. భూముల హద్దులు, పాత రికార్డుల్లో తప్పులు, సాదాబైనామాలు, అబాది ఆస్తులు వంటి సమస్యలకు సమగ్ర భూ సర్వే ద్వారా పరిష్కారం చూపవచ్చని రాష్ట్ర రెవెన్యూ,

2లో..

# తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం

## - ఏపీలో వర్షాలు, తెలంగాణలో ఎండలు!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల్లో భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఏపీలో వాతావరణం చల్లబడి, వర్షాలు కురుస్తుండగా ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఏపీలో పలుచోట్లు ఆకాశం మేఘావృతమై ఉంది. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్ సహా పలు జిల్లాల్లో భానుడు భగభగమంటున్నాడు.

2లో..

# యూపీఐ ఛార్జీలపై స్టేకు నిరాకరణ

### చట్టబద్ధతపై సుప్రీంకోర్టు ప్రశ్నలు

సీనియర్ న్యాయవాది అంజన్ దత్తా దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ సందర్భంగా యూపీఐ ఛార్జీల విధింపుపై కేంద్రాన్ని వివరణ కోరింది. కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకటరామన్ ఇది ప్రభుత్వం వసూలు చేసే పన్ను లేదా ఫీజు కాదని ధర్మాసనానికి వివరించారు. ఈ ఛార్జీలు చెల్లింపుల వ్యవస్థ పరిధిలోనే ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది. యూపీఐ లావాదేవీలలో భాగస్వాములైన బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, ఇతర సంస్థల మధ్య పంపిణీ అవుతుందని తెలిపింది. ఈ అంశంపై స్పందించేందుకు కేంద్రం, ఆర్బీఐ , ఎన్‌పీసీఐలకు నాలుగు వారాల గడువు ఇచ్చింది.

### అక్టోబర్ 15 నుంచి వచ్చే మార్పులేంటి?

కొత్త నిబంధనలు అమలులోకి వచ్చినంత మాత్రాన రూ. 2,000 దాటిన ప్రతి యూపీఐ చెల్లింపుపై ఫీజు వసూలు చేస్తారని కాదు. ఈ ఎండీఆర్ కేవలం రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన నిర్దిష్ట వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుంది. ఈ లావాదేవీలపై ఎండీఆర్ 0.4 శాతంగా ఉంటుంది. రూ. 75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలపై గరిష్ఠ పరిమితి (క్యాప్) రూ. 300గా నిర్ణయించారు. ఉదాహరణకు ఒకవేళ రూ. 10,000 చెల్లింపు ఎండీఆర్ పరిధిలోకి వస్తే, 0.4 శాతం చొప్పున ఆ ఛార్జీ రూ. 40 అవుతుంది.అయితే ఇది కేవలం వ్యాపారుల చెల్లింపుల వ్యవస్థకు సంబంధించిన రుసుము మాత్రమే. వినియోగదారుల నుంచి ఈ మొత్తాన్ని విడిగా వసూలు చేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంతేకాకుండా, ఈ కొత్త నిబంధనల పేరుతో యూపీఐ యాప్‌లు వినియోగదారులపై ఎలాంటి ప్లాట్‌ఫారమ్ ఫీజులు లేదా రహస్య రుసుములు విధించడానికి అనుమతి లేదని ఆర్థిక శాఖ తెలిపింది.

# అసెంబ్లీ కంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లా

తాను ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తనను అనేకసార్లు జైలుకు పంపించారని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. 2014 తర్వాత తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ వర్సెస్ రేవంత్ రెడ్డిగా పరిస్థితి మారిందని ముఖ్యమంత్రి చెప్పారు. తాను అసెంబ్లీకి వెళ్లిన దానికంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లాను అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రస్థానం మొదటి నుంచీ అధికారంలో ఉన్న ప్రభుత్వాలను ప్రశ్నించే వైఖరితో సాగిందని వివరించారు. 2006లో జడ్పీటీసీగా 2007లో ఎమ్మెల్సీగా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచినట్లు చెప్పారు. ఆ రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ నుంచి నిలబడిన అభ్యర్థులను తాను ఓడించినట్లు గుర్తుచేశారు. అప్పట్లో తెలంగాణలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ప్రధాన రాజకీయ శక్తులుగా ఉన్నాయని పేర్కొన్నారు.అప్పట్లో జిల్లా కాంగ్రెస్ నేతలతో తనకు పెద్దగా సంబంధాలు లేవని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వంపై పోరాడాలంటే ప్రతిపక్షంలో ఉండటమే సరైన మార్గమని భావించి తాను తెలుగుదేశం పార్టీలో చేరినట్లు చెప్పారు. టీడీపీ తరఫున 2009, 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించినట్లు వివరించారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో టీడీపీ రాజకీయ ప్రాధాన్యం తగ్గిందని అన్నారు. టీడీపీ ప్రధాన నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఉండటంతో తెలంగాణలో పార్టీ బలహీనపడిందని చెప్పారు. ఆ తర్వాత 2017లో కాంగ్రెస్‌లో చేరి 2019లో మల్కాజిగిరి నుంచి లోక్‌సభకు ఎన్నికైన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరడానికి తన రాజకీయ పరిస్థితులతో పాటు పలువురి సూచనలు కూడా కారణం అయ్యాయని రేవంత్ రెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీని తొలిసారి కలిసినప్పుడు సుమారు 15 నిమిషాలు మాట్లాడినట్లు చెప్పారు. ఆ సమావేశం తర్వాత రాహుల్ గాంధీని తన నాయకుడిగా ఎంచుకున్నట్లు వెల్లడించారు. రాహుల్ గాంధీకి వ్యక్తిగత రాజకీయ అజెండా లేదని దేశమే ఆయనకు ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీతో పాటు దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్ వంటి నేతలు తనకు శ్రేయోభిలాషులుగా ఉన్నారని చెప్పారు.ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశంలో రాజకీయాల తీరు భిన్నంగా ఉంటుందని రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో విద్యార్థి సంఘాల ప్రభావం తక్కువగా ఉంటుందని చెప్పారు. లెఫ్ట్, రైట్ భావజాలాలకు చెందిన విద్యార్థి సంఘాలు ఉన్నప్పటికీ ఎన్ఎస్‌యూఐ ప్రభావం అంతగా లేదని వ్యాఖ్యానించారు. విద్యార్థి రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం కనిపించినా ప్రధాన రాజకీయాల్లో మాత్రం కాంగ్రెస్ ప్రభావం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. యూనివర్సిటీ స్థాయిలో ఒక విద్యార్థి సంఘంలో ఉన్న వ్యక్తి గ్రామ స్థాయికి వచ్చిన తర్వాత కాంగ్రెస్ రాజకీయాల్లో ఉండే పరిస్థితి తెలంగాణలో ఉందని రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే రాష్ట్రంలో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదన్నది తన అభిప్రాయమని చెప్పారు.

తెలంగాణలో నాణ్యమైన విద్య అందించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒకటని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ప్రైవేట విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు ఆ తర్వాతి దశలో నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. అందులో భాగంగానే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చదువు వృత్తుల జీవితాలను ఎలా మార్చగలదో వివరిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల ప్రస్తావనను రేవంత్ ప్రస్తావించారు.ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపైనా సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పేదలు, ప్రతిపక్షాలకు చెందిన ఓటర్లను ప్రభావితం చేసే ఉద్దేశంతో ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆయన ఆరోపించారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. దేశ జనాభా తగ్గకపోయినా ఓటర్ల సంఖ్య ఎందుకు తగ్గుతుందనే ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎస్ఐఆర్ సందర్భంగా ఓట్ల తొలగింపుపై బీజేపీపై ఆయన గతంలోనూ ఆరోపణలు చేశారు. తాను విద్యార్థి రాజకీయాల నుంచి టీడీపీ, అక్కడి నుంచి కాంగ్రెస్ వరకు వివిధ దశల్లో ప్రయాణించినప్పటికీ తన రాజకీయ లక్ష్యం మాత్రం దేశం, రాష్ట్రం కోసం పనిచేయడమేనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో తన రాజకీయ ప్రయాణం ఎన్నో మలుపులు తిరిగిందని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఎదురైన అరెస్టులు, జైలు అనుభవాలు తన రాజకీయ జీవితంలో కీలక భాగమని ఆయన పేర్కొన్నారు.

# ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ

దానం నాగేందర్ 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేశారు. ఈ క్రమంలో ఆయనపై ఫిరాయింపు పిటిషన్లు వచ్చాయి.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారించిన తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్ ఎమ్మెల్యేగా కొనసాగేందుకు అనర్హుడు అని తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ నుంచి నెగ్గిన ఆయన కాంగ్రెస్ నుంచి బీఫారం పొంది పోటీ చేసినట్లు గుర్తించింది. దాంతో 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే దానం నాగేందర్ ఎమ్మెల్యేగా అనర్హుడని స్పష్టం చేసింది. తాజాగా అదే తేదీ నుంచి ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పేర్కొంటూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ లోని ఆర్టికల్ 191(2) లోని పేరాగ్రాఫ్ 2 (1)(a) కింద దానం నాగేందర్‌ను ఎమ్మెల్యేగా కొనసాగేందుకు అనర్హుడిగా పేర్కొంటూ హైకోర్టు సెప్టెంబర్ 18న తీర్పిచ్చింది.

# తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం

### ఏపీలో వాయుగుండం ఎఫెక్ట్

బంగాళాఖాతంలో మయన్మార్-అండమాన్ మధ్య వాయుగుండం ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీంతో రాగల 12 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారి, ఉత్తర వాయవ్యంగా బంగ్లాదేశ్ వైపు పయనించి 72 గంటల్లో ఈశాన్య బంగాళాఖాతం-బంగ్లాదేశ్ మధ్య తీరం దాటే అవకాశముంది. ప్రస్తుతం ఇది అండమాన్‌లోని మాయాబందర్‌కి 580 కి.మీ దూరంలో తూర్పు ఈశాన్యంగా కేంద్రీకృతమై ఉంది.

ఈ వాయుగుండం ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో గంటకు 30-40 కి.మీ వేగంతో గాలులు వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇటీవలే బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కళింగపట్నం వద్ద తీరం దాటడంతో ఉత్తరాంధ్రలో భారీగా వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే.

### తెలంగాణలో ఉష్ణోగ్రతలు.. ఎల్‌నినో ఎఫెక్ట్

మరోవైపు తెలంగాణలో ఇటీవల వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురిసినప్పటికీ, ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాధారణం కన్నా 4 డిగ్రీలు ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 34 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 31.8 డిగ్రీలు ఉదాల్పి ఉష్ణోగ్రతలు , ఆదివారం 34 డిగ్రీలుగా నమోదైంది. ఎల్‌నినో ప్రభావం కారణంగానే రానున్న రెండు రోజుల్లో మరో రెండు డిగ్రీలు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

## జలవనరులు కలుషితం కాకుండా

# చూడాలి

## - ఆక్వా వ్యర్థాలపై పవన్ సమీక్ష

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆక్వా వ్యర్థాల కారణంగా జలవనరులు కలుషితం కాకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వా ప్రాసెసింగ్, ఆక్వా ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు నిర్దేశిత పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలన్నారు. ఆక్వా కాలుష్యంపై ఇవాళ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. శుద్ధి చేయని ఆక్వా వ్యర్థాల్లో పరిమితికి మించి హానికారక రసాయనాలు ఉండడం వల్ల నదులు, కాలువలు, భూగర్భ జలాలు కాలుష్యం బారినపడుతున్నాయని పవన్ కల్యాణ్ చెప్పారు. ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బ తింటున్నాయని వివరించారు. జలవనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ఆక్వా ప్రాసెసింగ్, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి వెలువడుతున్న కాలుష్య ప్రభావం, నివారణ చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 119 ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, 12 ఆక్వా ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని పీసీబీ అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అక్కడ చేసే తనిఖీలు, నమూనాల సేకరణ, పరీక్షల నిర్వహణకు సంబంధించిన విషయాలను తెలియజేశారు. ఈ క్రమంలో స్పందించిన ఆక్వా ప్రాసెసింగ్, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లలో క్రమం తప్పకుండా నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని అధికారులు సూచించారు. తద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి నివారించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఉల్లంఘనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆక్వా యూనిట్లు పర్యావరణ ప్రమాణాలు సమర్థవంతంగా పాటించేలా చేయడమే లక్ష్యమని పవన్ స్పష్టం చేశారు.మరోవైపు అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లు, వర్షపు నీటి కాలువల్లో నల్లటి రంగుతో కూడిన నీరు ప్రవహిస్తోందని దీంతో దుర్వాసన వస్తోందని శుక్రవారం నాడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరు వీడియో పోస్ట్ చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో పర్యటించి వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు.దీంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. వీడియో ఆధారంగా ఆయా ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో తనిఖీలు చేపట్టారు. శుద్ధి చేయని వ్యర్థాలతో కూడిన నీటిని ఇందులోకి విడుదల చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు దీనిపై వివరణ కోరుతూ 95 కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపు నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మురుగునీరు లేదా కలుషిత నీటిని బయటకు విడుదల చేయరాదని చెప్పారు.ఎఫ్లుయెంట్, ప్రమాదకర వ్యర్థాలను క్రమం తప్పకుండా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని అధికారులు తెలిపారు. శుద్ధి చేసిన వ్యర్థాలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని కనీసం ఆరు నెలల పాటు భద్రపరచాలన్నారు. కన్‌సెంట్ టు ఆపరేట్ , హాజర్డస్ వేస్ట్ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని చెప్పారు. అక్రమంగా మురుగునీరు, ప్రమాదకర వ్యర్థాలు, ఉప ఉత్పత్తుల వంటి వాటిని విడుదల చేస్తున్నట్లు నిర్ధారణయితే ఆయా పరిశ్రమలపై పర్యావరణ నిబంధనలను అనుసరించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న పరిశ్రమలను ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే షోకాజ్ నోటీసులపై స్పందించేందుకు పరిశ్రమలకు ఏడు రోజుల సమయమిచ్చారు. నిర్దేశిత సమయంలో సంతృప్తికరమైన వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ మేరకు తీసుకున్న చర్యలను వివరిస్తూ ఒక నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. మరోవైపు అధికారుల చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## 110 కోట్లు దాటిన

# బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య

(సుమారు 110.12 కోట్లు) చేరింది. జులై నెలలో ఈ సంఖ్య 1,094.48 మిలియన్లుగా ఉండగా, కేవలం ఒక్క నెలలోనే 0.61 శాతం వృద్ధి నమోదైంది. ఇదే సమయంలో, యాక్టివ్ వైర్‌లెస్ (మొబైల్) సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1,207.59 మిలియన్లుగా (120.75 కోట్లు) ఉన్నట్లు తేలింది. కాగా, ఆగస్టు నెలలో ఏకంగా 15.83 మిలియన్ల (1.58 కోట్లు) మంది తమ మొబైల్ నెట్‌వర్క్‌ను మార్చుకునేందుకు మొబైల్ నంబర్ పోర్టబిలిటీ కోసం దరఖాస్తు చేసుకోవడం విశేషం.

మరోవైపు, వైర్‌లైన్ (ల్యాండ్‌లైన్) కనెక్షన్ల సంఖ్య కూడా పెరిగింది. జులై చివరికి 48.01 మిలియన్లుగా ఉన్న ఈ సంఖ్య, ఆగస్టు చివరి నాటికి 48.45 మిలియన్లకు చేరింది. నెలవారీగా 0.93 శాతం పెరుగుదల కనిపించింది. వైర్‌లైన్ కనెక్షన్లలో పట్టణ ప్రాంతాల వాటా 89.08 శాతంగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల వాటా 10.92 శాతంగా ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్, ఏపీఎస్ఎఫ్ఎల్ కలిసి వైర్‌లైన్ మార్కెట్‌లో 16.05 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇదిలా ఉండగా, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ట్రాయ్ ఇటీవల ఒక కీలక ముందడుగు వేసింది. ఇళ్లు, కార్యాలయాలు వంటి భవనాల్లో డిజిటల్ కనెక్టివిటీ నాణ్యతను తెలుసుకునేందుకు 'డిజిటల్ కనెక్టివిటీ రేటింగ్ (డీసీఆర్)' పేరుతో ఒక కొత్త ప్లాట్‌ఫామ్‌ను, మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా వినియోగదారులు తాము కొనుగోలు చేయాలనుకుంటున్న లేదా అద్దెకు తీసుకోవాలనుకుంటున్న భవనాల్లో ఇంటర్నెట్, మొబైల్ సిగ్నల్ నాణ్యత ఎలా ఉందో ముందుగానే తనిఖీ చేయవచ్చు. "ఈ రేటింగ్స్ వల్ల వినియోగదారులు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేందుకు వీలు కలుగుతుంది. నాణ్యమైన కనెక్టివిటీ ఉన్న ఇళ్లు, ఆఫీసులను ఎంచుకోవడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది" అని ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లహోటి వివరించారు.

# వాయు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు

పార్కింగ్ ఛార్జీలను రెట్టింపు చేయడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త నిబంధనల ప్రకారం, నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితోనే కార్యకలాపాలు సాగించాలి. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, నగర వ్యాప్తంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ కాలంలో పార్కింగ్ ఫీజులను కూడా రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించింది. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా, పారిశ్రామిక ఉద్గారాల వంటి కారణాలతో ఢిల్లీ నగరం ప్రతి ఏటా గ్యాస్ ఛాంబర్‌ను తలపిస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ చర్యల ద్వారా శీతాకాలంలో కాలుష్య తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



**మహబూబాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో పట్టభద్రుల ఓటు ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుంది.పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ, అంటే డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు, 2019 నవంబర్ 1వ తేదీ నాటికి 3 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు అర్హులు.చాలా మందికి తెలియదు, ఇంతకు ముందు ఉన్న ఓటు ఇప్పుడు చెల్లదు. కావున ప్రతి ఒక్కరూ కొత్తగా మళ్ళీ నమోదు చేసుకోవాలి. ఇది తప్పనిసరి గమనించాలి.మన ఉపాధ్యాయులు, పట్టభద్రులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మనకు ఒక బలమైన గొంతుక కావాలి. శాసన మండలిలో మన సమస్యలను వినిపించే వ్యక్తిని ఎన్నుకోవాలంటే ముందు మనం ఓటరుగా నమోదు కావాలి.కాబట్టి నేను ఎం రాష్ట్ర అధ్యక్షుడిగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. మీ పరిధిలో ఉన్న పట్టభద్రులందరినీ, మీ మిత్రులను, మీ బంధువులను, మీ గ్రామంలో ఉన్న యువతను చైతన్య పరచండి. ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకునేలా చేయండి.ఓటు నమోదుకు కావలసింది డిగ్రీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, ఫోటో. ఆన్ లైన్ లో కూడా చేసుకోవచ్చు.చివరి తేదీ లోపు ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను.

# అహర్నిశలు మంగళగిరి ప్రజల గురించే ఆలోచిస్తా

### రూ.2వేల కోట్ల విలువైన భూములపై పేదలకు హక్కులు

రాష్ట్ర విద్యా,ఐటీ,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో హామీని దాదాపుగా పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండలం కుంచనపల్లిలో 372 మంది లబ్ధిదారులకు సోమవారం మంత్రి లోకేశ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. శ్రీ శ్రీనివాస కన్వెన్షన్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ భూముల్లో చాలాకాలంగా నివసిస్తున్న పేదలకు శాశ్వత హక్కు పత్రాలను అందజేశారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇప్పటివరకు రెండు విడతల్లో 5,636 మంది పేదలకు ఉచితంగా శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. దీని ద్వారా సుమారు రూ.2 వేల కోట్ల విలువైన భూములపై పేదలకు హక్కులు కల్పించారు.మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్యను 80 శాతం పరిష్కరించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

### 80శాతం పట్టాల సమస్యకు పరిష్కారం

మంగళగిరి నియోజకవర్గంలో దాదాపు 80 శాతం పట్టాల సమస్యను ఇప్పటికే పరిష్కరించామని మిగిలిన కేంద్ర ప్రభుత్వ భూముల సమస్యల పరిష్కారం కోసం సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం పేదల దశాబ్దాల కలను నెరవేరుస్తున్నామని తెలియజేశారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు రెండు విడతలుగా పట్టాల పంపిణీ పూర్తి చేసినట్లు చెప్పుకొచ్చారు. తొలి విడతలో 3,002 మందికి, రెండో విడతలో 2,634 మందికి పట్టాలు అందజేశారు. ఈ రెండు విడతల్లో కలిపి సుమారు రూ.2 వేల కోట్ల విలువైన భూములకు ఉచితంగా శాశ్వత హక్కులు కల్పించినట్లు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు.

### ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం

ప్రభుత్వ శాఖల భూముల్లో ఏళ్లుగా నివసిస్తున్న పేదలకు శాశ్వత హక్కులు కల్పిస్తున్నామని ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని భూముల సమస్యల పరిష్కారానికి కూడా లోకేశ్ ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.అంతేకాదు అటవీ, ఇరిగేషన్, రెవెన్యూ, దేవాదాయ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని భూముల సమస్యలను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు మంత్రి లోకేశ్ ప్రకటించారు.

# రీసర్వేతోనే భూసమస్యలకు చెక్

హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీసర్వే కీలక మార్గమని ఆయన పేర్కొన్నారు. వనపర్తిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలపై సమీక్ష నిర్వహించిన తర్వాత మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. వనపర్తిలో రెవెన్యూ అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా తొలి దశలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి సమగ్ర భూ సర్వే చేపడుతున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా నక్షాలు అందుబాటులో లేని మరో 413 రెవెన్యూ గ్రామాలను కూడా దశలవారీగా సర్వే చేయనున్నట్లు వెల్లడించారు.ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు జియో కోఆర్డినేట్స్‌తో కూడిన మ్యాప్, ఎల్‌పీఎం నంబర్ అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి చెప్పారు. సర్వే పూర్తి అయిన తర్వాత భూ యజమానులకు భూమికి సంబంధించిన వివరాలను మరింత స్పష్టంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే తెలంగాణలో భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రీసర్వేను రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తోంది. ఇటీవల మహబూబాబాద్ జిల్లాలో రీసర్వే పూర్తయిన అసైన్డ్ భూములకు సంబంధించిన రైతులకు పట్టాదార్ పాస్‌బుక్కులు అందించినట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరికరాలను సమకూర్చుతోందని పొంగులేటి తెలిపారు. తొలి దశలో కొనుగోలు చేసిన రోవర్లతో పాటు రెండో దశలో అదనపు రోవర్లను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. జిల్లాల అవసరాలకు అనుగుణంగా వాటిని కేటాయిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా వేలాది మంది సర్వేయర్లకు లైసెన్సులు మంజూరు చేసి క్షేత్రస్థాయిలో సర్వే పనులను వేగవంతం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాజకీయ ప్రచారాలకు దూరంగా ఉండి ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వాములై రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించేలా పనిచేయాలని సర్వేయర్లకు సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ఏళు ్లగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాలు, భూ హద్దుల వివాదాలు, పాత రెవెన్యూ రికార్డుల్లోని లోపాలు, అబాది ఆస్తుల వివరాలు వంటి సమస్యలను సమగ్ర సర్వే ద్వారా పరిష్కరించే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. దశాబ్దాలుగా భూమిని సాగు చేస్తున్నప్పటికీ సరైన టైటిల్ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను కూడా గుర్తించి.. నిబంధనల ప్రకారం సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, నివాస ప్రాంతాలు, అబాది ఆస్తులకు సంబంధించి గతంలో స్పష్టమైన మ్యాపింగ్ లేకపోయిన సందర్భాలు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇకపై సర్వే ద్వారా ప్రతి ఆస్తి విస్తీర్ణం, హద్దులు వంటి వివరాలను మ్యాప్‌తో సహా రికార్డుల్లో పొందుపరచనున్నట్లు చెప్పారు. ధరణి వ్యవస్థ కారణంగా ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగిస్తూ భూ భారతి ద్వారా మరింత పారదర్శకమైన భూ రికార్డుల వ్యవస్థను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి తెలిపారు. ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు, మ్యాప్, జియో కోఆర్డినేట్స్ వంటి వివరాలు అందుబాటులో ఉంటే భవిష్యత్తులో హద్దులు, యాజమాన్యానికి సంబంధించిన వివాదాలను తగ్గించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది.భూ సమస్యలను కార్యాలయాల్లో కూర్చొని కాకుండా ప్రజల కోణంలో పరిశీలించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల్లో కొన్ని ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన వాటిని కూడా నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంతో పాటు పేదల సొంతింటి కలను నెరవేర్చడంపైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని పొంగులేటి తెలిపారు. తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో 2 లక్షలకు పైగా ఇళ్లు పూర్తి అయినట్లు చెప్పారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తామని తెలిపారు. రెండో విడతలో నిర్మాణం ప్రారంభించే ఇళ్లలో గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పేదల ఇళ్లకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. రెండో విడతలో అవకాశం రాని అర్హులైన పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మూడో, నాలుగో విడతల ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.మొత్తంగా భూ భారతి కింద చేపడుతున్న రీసర్వే ద్వారా పాత భూ రికార్డుల్లోని సమస్యలను గుర్తించి, భూముల హద్దులు, మ్యాపింగ్, యాజమాన్య వివరాలను మరింత స్పష్టంగా నమోదు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తి అయితే భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

# మంత్రివర్గ విస్తరణకు మళ్లీ బ్రేక్

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో మంత్రివర్గ విస్తరణ అంశం ఎప్పుడూ వార్తల్లో ఉంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లవుతున్నా ఇప్పటివరకూ పూర్తిస్థాయి కేబినెట్ ఏర్పడలేదు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ ఏడాది ఆఖరు వరకు లేదా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం లేదని తెలుస్తోంది.ప్రభుత్వంలో ఇప్పటికే రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉండగా, ఇటీవల కొండా సురేఖ ఉద్వాసనతో ఆ సంఖ్య మూడుకి చేరింది. ఖాళీలను తక్షణమే భర్తీ చేస్తారని.. దసరాలోపు విస్తరణ ఉంటుందని జోరుగా ప్రచారం జరిగింది. అయితే కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ విదేశీ పర్యటనకు వెళ్లడం.. మరోవైపు అధిష్టానం సమయం తీసుకోవాలని భావిస్తుండటంతో ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ ఉండదని అర్థమైపోయింది. కొత్తగా బాధ్యతలు స్వీకరించే వారికి రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రాంతీయ సమీకరణాలు అర్థం కావడానికి కాస్త సమయం పడుతుంది.మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో సామాజిక వర్గాల సమతుల్యత పాటించడం రేవంత్ సర్కార్‌కు కత్తి మీద సాములా మారింది. ఇటీవల కొండా సురేఖ నిష్క్రమణ తర్వాత, ఆ స్థానాన్ని భర్తీ చేసే క్రమంలో బీసీ వర్గాలకు చెందిన మున్నూరుకాపు, పద్మశాలి, గౌడ వర్గాలకు చెందిన ముగ్గురు మహిళలకు కీలక బాధ్యతలు అప్పగించారు. కానీ కేబినెట్ కూర్పులో ప్రాంతీయ, కుల సమీకరణాల ఒత్తిడి అధికార పార్టీపై స్పష్టంగా కనిపిస్తోంది. యాదవ సామాజిక వర్గానికి చెందిన ఒకరికి కేబినెట్‌లో చోటు దక్కాలని సుదీర్ఘకాలంగా డిమాండ్ వినిపిస్తోంది. అలాగే లంబాడాల నుంచి కచ్చితంగా ఒకరికి స్థానం దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

ఉమ్మడి నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వరంగల్ నుంచి మాధవరెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా ఎప్పటినుంచో కేబినెట్ సీటు కోసం ఎదురు చూస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పేరు కూడా కొత్త టీమ్‌లో వినిపిస్తోంది. ఒకవేళ పీసీసీ అధ్యక్షుడికి మంత్రివర్గంలో చోటు ఇస్తే, ప్రస్తుత మంత్రులలో ఒకరికి ఆ బాధ్యతలు అప్పగించేలా వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటే ఆ స్థానం లక్ష్మణ్‌కుమార్‌కు దక్కవచ్చనే చర్చ కూడా జరుగుతోంది.హడావుడిగా కేబినెట్ విస్తరణ చేపట్టడం కంటే రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వరకు వేచి చూడాలని హైకమాండ్ యోచిస్తున్నట్టు సమాచారం. మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు చేస్తే.. ఎన్నికల సమయంలో అసంతృప్తి రగులుతుందనే భయం కూడా పార్టీని వెంటాడుతోంది. అందుకే అలాంటి వాటికి తావివ్వకుండా చూసేందుకే ఈ తాత్సారం జరుగుతోందని స్పష్టమవుతోంది.

## హైదరాబాద్‌లో ఎఫ్‌పీటీఏ 65వ జాతీయ వార్షిక సదస్సు

హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్స్ (ఎఫ్‌పీటీఏ) 65వ జాతీయ వార్షిక సదస్సుకు శ్రీకారం చుట్టారు. బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్‌లో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అక్టోబర్ 2 నుంచి 5 వరకు నోవాటెల్ హెచ్‌ఐసీసీలో జరిగే ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా పేపర్ వ్యాపారులు, తయారీదారులు, పారిశ్రామిక ప్రముఖులు హాజరుకానున్నారు. పేపర్ పరిశ్రమ అభివృద్ధి, ఎంఎస్‌ఎంఈలకు వర్కింగ్ క్యాపిటల్, నోట్‌బుక్స్‌పై జీఎస్టీ సరళీకరణ, రీసైకిల్డ్ పేపర్ వినియోగం వంటి కీలక అంశాలపై సదస్సులో చర్చించనున్నారు.

## విద్యుత్ సౌదాలో మహా నిరసన సభ

**- పదోన్నతుల్లో అన్యాయాలను అరికట్టాలని డిమాండ్**

పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలని కోరుతూ ఖైరతాబాద్ లోని విద్యుత్ ప్రధాన కార్యాలయం విద్యుత్ సౌదాలో సోమవారం మహా నిరసన సభ ను నిర్వహించారు. రాష్ట్రంలో నలుమూలల నుంచి సుమారు 800 మంది ఉద్యోగులు నిరసన సభలో పాల్గొని అన్యాయాలను సరిచేయాలని ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘంఅధ్యక్షుడు డి.శ్యామ్ మనోహర్, సెక్రెటరీ జనరల్ రమేష్ మేడి, కార్యనిర్వాహక అధ్యక్షుడు కొమ్ము చంద్రయ్య మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎండీ ప్రభాకర్ రావు తీసుకొచ్చిన 954 టీఓ ఓ తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఒక్క ఉద్యోగికి అన్యాయం జరగకుండా పాత విధానాన్నే అమలు చేయాలని ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నామని అన్నారు. ఈ సమస్య ను అప్పటి పిసిసి రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్కులకు సైతం విన్నవించినట్లు తెలిపారు. ప్రభుత్వంలో కొచ్చినా తమ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్గలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను సారి చెయ్యాలని కోరారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి న్యాయబద్ధంగా పదోన్నతులు, అవకాశాలు రావాలన్నదే మా ఆకాంక్ష అని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే శాంతియుత పద్ధతిలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## చంద్రబాబు మహిళలకు ఇచ్చిన 1500 హామీ ఏమైంది

**- ఆడబిడ్డలను మోసం చేసిన కూటమి సర్కార్**



**రంప చోడవరం** ఎన్నికల సమయంలో మహిళల ఓట్ల కోసం చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలలో కీలకమైన ఆడబిడ్డ నిధి పథకం అటకెక్కింది. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500, ఏడాదికి 18,000 ఇస్తామని గొప్పగా ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడిచినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.ఎన్నికల ముందు ప్రతి ఇంటికి తిరిగి 1500 ఇస్తామని నమ్మించిన చంద్రబాబు, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. బడ్జెట్ లో 3300 కోట్లు కేటాయించామని చెప్పడం తప్ప ఆచరణలో మాత్రం శూన్యం గా మిగులు పోయిందిజగనన్న హయాంలో ప్రతి నెలా ఏదో ఒక పథకం ద్వారా మహిళల ఖాతాల్లో డబ్బులు పడేవి. కానీ కూటమి సర్కార్ వచ్చాక మహిళలకు మిగిలింది నిరాశే. సూపర్ సిక్స్ అన్నారు, సూపర్ ఫెయిల్ అయ్యింది అంటూ మహిళలు గుస గుసలు లాడుకుంటున్నారు

## దృష్టిలోపం ఉన్నవారికి బస్సు గుర్తింపు వ్యవస్థ

**- జాతీయ స్థాయికి ఎంపికైన కోట కందుకూరు విద్యార్థి వంశీ**



**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ మండలం కోట కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి వంశీ ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్‌స్పైర్ అవార్డు?ఎం ఏ ఎన్ ఏ కే కార్యక్రమంలో వంశీ రూపొందించిన "బస్ ఐడెంటిఫికేషన్ సిస్టం ఫర్ బ్లైండ్ పీపుల్ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది.దృష్టిలోపం ఉన్నవారు తమకు అవసరమైన బస్సును సులభంగా గుర్తించేందుకు సహాయపడే విధంగా వంశీ ఈ వినూత్న ప్రాజెక్టును రూపొందించాడు. సామాజిక సమస్యకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసి పరిష్కారం చూపేలా రూపొందించిన ఈ ప్రాజెక్టు ఎంపిక కమిటీని ఆకట్టుకుంది.విద్యార్థి వంశీని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి వి.వి. శకుంతల అభినందించారు. ప్రాజెక్టు రూపకల్పనలో మార్గదర్శకత్వం అందించిన గైడ్ టీచర్ శ్రీమతి కృష్ణవేణిని అభినందించారు.వంశీ సాధించిన ఈ విజయం పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మరియు కోట కందుకూరు గ్రామానికి గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే ఆ ఆవిష్కరణలు చేయాలని వారు ఆకాంక్షించారు.

## ఆళ్లగడ్డలో ఘనంగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 19 ఏళ్ల సినీ ప్రస్థాన వేడుకలు



**ఆళ్లగడ్డ** తెలుగు చలనచిత్ర పరిశ్రమలో గ్లోబల్ స్టార్‌గా ఎదిగి, కోట్లాది మంది అభిమానుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి విజయవంతంగా 19 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆళ్లగడ్డ మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో సోమవారం నాడు పట్టణంలోని రామలక్ష్మి థియేటర్ నందు ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా స్పోక్ పర్సన్ షేక్ మాబూ భాష మాట్లాడుతూ చిరుత సినిమాతో మాస్ హీరోగా ప్రయాణం మొదలుపెట్టి, 'మగధీర'తో బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసి, రంగస్థలం తో నటుడిగా నూటికి నూరు మార్కులు తెచ్చుకుని చివరకు ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంతో ఆస్కార్ వేదికపై ప్రపంచవ్యాప్తంగా మన తెలుగు సినిమా కీర్తిని సగర్వంగా నిలబెట్టిన ఘనత రామ్ చరణ్ కేవలం సినిమాలే కాకుండా, అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో యువతకు ఆదర్శంగా నిలుస్తున్న మన రామ్ చరణ్ గారి 19 ఏళ్ల ప్రస్థాన వేడుకను ఆళ్లగడ్డలోని మెగా అభిమానులందరం కలిసి జరుపుకోవడం జరిగిందని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఆళ్ళగడ్డ నియోజకవర్గ మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ పసుల నరేంద్ర, రామ్ శెట్టి వెంకటసుబ్బయ్య ,దూదేకుల బాబు, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

## రేబిస్ మరణాలను నివారించాలి

**రాయచోటి,** ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రూపొందించిన ప్రచార సామాగ్రిని సోమవారం పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ తో పాటు చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ వై. శ్రీనివాసులు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై, ఇతర శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28న ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రేబిస్ అత్యంత ప్రాణాంతకమైన జూనోటిక్ వ్యాధి అని, వ్యాధి నివారణలో అవగాహన, సకాలంలో టీకాలు వేయించుకోవడం అత్యంత కీలకమన్నారు. ఈ ఏడాది "కలిసికట్టుగా... మరింత బలంగా" అనే నినాదంతో రేబిస్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.కుక్క కాటు వల్లే మానవుల్లో అత్యధిక రేబిస్ కేసులు నమోదవుతున్నాయని, కుక్కలు, పిల్లులు తదితర జంతువులకు కూడా రేబిస్ టీకాలు వేయించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. 2030 నాటికి కుక్కల ద్వారా సంభవించే రేబిస్ మరణాలను నిర్మూలించాలనే "జీరో బై 30" లక్ష్య సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.కుక్క కరిస్తే వెంటనే గాయాన్ని శుభ్రం చేయాలి.కుక్క లేదా ఇతర జంతువు కరిచిన వెంటనే గాయాన్ని ప్రవహించే నీరు, సబ్బుతో కనీసం 10?15 నిమిషాల పాటు శుభ్రంగా కడగాలని సూచించారు. గాయంపై కారం, పసుపు, సున్నం, కాఫీ పొడి, ఆకుల పసర్లు వంటి వాటిని ఉపయోగించరాదన్నారు. వైద్యుల సూచన లేకుండా గాయాన్ని గట్టిగా కట్టడం లేదా కుట్లు వేయడం చేయకూడదని తెలిపారు.ప్రథమ చికిత్స అనంతరం ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యుల సూచన మేరకు రేబిస్ నిరోధక టీకాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రేబిస్ నిరోధక టీకాలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలుపెంపుడు కుక్కలు, పిల్లులకు యజమానులు తప్పనిసరిగా రేబిస్ నిరోధక టీకాలు వేయించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. మూడు నెలల వయసులో మొదటి టీకా వేయించి, అనంతరం వైద్యుల సూచన మేరకు ప్రతి సంవత్సరం బూస్టర్ డోస్ ఇప్పించి రికార్డులను భద్రపరచాలన్నారు.వీధి కుక్కల నియంత్రణకు స్థానిక సంస్థలు యానిమల్ బర్త్ కంట్రోల్ సామూహిక రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వీధి కుక్కలను రెచ్చగొట్టడం, రాళ్లతో కొట్టడం, నిద్రిస్తున్నప్పుడు భయపెట్టడం వంటివి చేయకూడదని, ముఖ్యంగా పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు.రేబిస్ నియంత్రణ ఒక్క వైద్య, ఆరోగ్య శాఖతోనే సాధ్యం కాదని, పశు సంవర్ధక శాఖ, స్థానిక సంస్థలు, పెంపుడు జంతువుల యజమానులు, జంతు సంక్షేమ సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మానవ ఆరోగ్యం, జంతు ఆరోగ్యం పరస్పరం ముడిపడి ఉన్న 'వన్ హెల్త్' విధానంతోనే రేబిస్‌ను సమర్థవంతంగా నియంత్రించగలమన్నారు.ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న పెంపుడు కుక్కల టీకా కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎస్ఓ డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ హెచ్ఈఓ మహమ్మద్ రఫీ, ఎపిడెమియాలజిస్ట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## మండలానికి వేయి క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు

**- ఏఓ సురేష్ బాబు**

**తుగ్గలి:**2026 రబీ సీజన్ కి మండలానికి వేయి క్వింటాళ్ల సెనగ విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు మండల వ్యవసాయాధికారి సురేష్ బాబు తెలిపారు.సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి గ్రామంలోని వ్యవసాయ కార్యాలయంలొ ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది దాదాపు మూడు వేల ఎకరాలలో సెనగ పంట సాగు అవుతుందని అంచనా వేశామన్నారు.ప్రభుత్వం 35 శాతం రాయితీతొ రైతులకు సెనగ విత్తనాలు పంపిణి చేస్తుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం క్వింటం సెనగ విత్తనాల ధర తొమ్మిది వేల రూపాయలు ఉండగా,ముప్పై ఐదు శాతం రాయితీ అనగా మూడు వేల నూట యాభై రూపాయలు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని,రైతు ఐదు వేల ఎనిమిది వందల యాభై రూపాయలు చెల్లించాలని ఆయన తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు రాయితీతొ సెనగ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని ఆయన తెలిపారు.త్వరలోనే సెనగ విత్తన పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.త్వరితగతిన రైతులు పంట నమోదును పూర్తి చేసుకోవాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు

## మంత్రాల నెపంతో మహిళలు చెట్టు కట్టేసి కొట్టిన గ్రామస్తులు

**రంగారెడ్డి** రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని నోముల గ్రామంలో స్థానికులు మంత్రాల నెపం తో మహిళలు చెట్టు కట్టేసి కొట్టారు. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నోముల గ్రామానికి చెందిన పల్లటి వెంకటమ్మ ( 60) చేతబడి చేస్తుంది అని వెంకటమ్మ ను గ్రామస్తులు చితక బాదారు..బాధితులు మంచాల పోలీస్ స్టేషన్ పిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెను విడిపించారు. 14 మది పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సౌభాగ్య పౌడర్ విక్రయిస్తే కఠినచర్యలు

**- దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ.**

**రుద్రవరం.** కల్లాపు నీటిలో కలిపే సౌభాగ్య పౌడర్ ను విక్రయిస్తే అలాంటి దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ జయప్ప తెలిపారు. మండల కేంద్రం తో పాటు పలు గ్రామాలలోని కిరాణా దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన సౌభాగ్య పౌడర్ ను ఎవరు కూడా ప్రజలకు విక్రయించకూడదని అందుకు విరుద్ధంగా ఎవరైనా సౌభాగ్యపౌడర్ విక్రయిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని దుకాణదారులకు తెలియజేశారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఘన సన్మాన కార్యక్రమం



**బద్వేలు** బద్వేల్ మండల ప్రజా పరిషత్ సభ్యులు, జిల్లా ప్రజా పరిషత్ సభ్యులు సర్పంచుల పదవీకాలం పూర్తయిన సందర్భంగా, బద్వేల్ పట్టణంలోని నెల్లూరు రోడ్‌లో గల రాఘవేంద్ర గ్రాండ్ నందు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి బద్వేల్ మున్సిపాలిటీ వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు సుందరరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గౌరవ శాసన సభ్యురాలు శ్రీమతి డా. దాసరి సుధమ్మ , బద్వేల్ నియోజకవర్గ పరిశీలకులు,మాజీ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జున రెడ్డి , బద్వేల్ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి కూడా మాజీ చైర్మన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు సింగసాని గురుమోహన్ , బద్వేల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ గోపాలస్వామి ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా సింగసాని శివయ్య , బద్వేల్ కౌన్సిలర్లు బి.రమణ , ఆవుల శ్రీనివాసులు , రజిని ,. రామచంద్ర రెడ్డి , మన్యం సాంబశివ రెడ్డి శివ కోటి రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు ఇటీవల పదవీ విరమణ పొందిన సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు, జడ్పిటిసి సభ్యులకు సభాముఖంగా అభినందనలు తెలియజేయడం జరిగినది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి , కడప పార్లమెంట్ సభ్యులు వై.ఎస్. అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ సూచించిన ప్రతి అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు.పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేస్తూ, జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేసే వరకు అవిశ్రాంతంగా పోరాడాలని నాయకులు పేర్కొన్నారు.అనంతరం ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు సర్పంచులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల భవితకు బాసటగా ఎమ్మెల్యే అమిలినేని

**- కళ్యాణదుర్గం వీధుల్లో సైకిళ్ల సైన్యం!**

**- కరణం చిక్కప్ప పాఠశాల మైదానంలో 1500 మందికి ఉచిత సైకిళ్ల పంపిణీ**

**- విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసిన ప్రజాప్రతినిధులు**

**కళ్యాణదుర్గ్** భావి భారత పౌరుల చదువుల ప్రయాణానికి రెక్కలు తొడుగుతూ, కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్ర బాబు చేపట్టిన సేవా సంకల్పం పట్టణ ప్రజల మనసులను దోచుకుంది. స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఘనంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని దాదాపు 1500 మంది నిరుపేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. పాఠశాలలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడే గ్రామీణ, పేద విద్యార్థులకు ఈ సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన ఆకాంక్షించారు.

## హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పనులకు రూ.337.90 కోట్లు మంజూరు

**- సవరించిన పరిపాలనా అనుమతులు జారీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**అమరావతి** :హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) ప్రాజెక్టు ఫేజ్-2 పనులకు ప్రభుత్వం సవరించిన పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని ప్రధాన కాలువ లైనింగ్, సొరంగం పనుల కోసం మొత్తం రూ.337.90 కోట్లు కేటాయిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు (జీవో ఆర్‌టీ నెం. 554) జారీ చేశారు.గతంలో ఈ ప్యాకేజీ-2 పరిధిలోని పనులకు రూ.158.19 కోట్లతో పరిపాలనా ఆమోదం లభించింది. ఇందులో కి.మీ. 260 నుంచి 280 వరకు కాలువ లైనింగ్‌కు రూ.64.20 కోట్లు, కి.మీ. 280 నుంచి 300 వరకు లైనింగ్ పనులకు రూ.57.80 కోట్లు, కి.మీ. 285.100 నుంచి 287.100 మధ్య సొరంగం పనులకు రూ.36.19 కోట్లు కేటాయించారు.అయితే, క్షేత్రస్థాయి అవసరాలు, ధరల సర్దుబాటు తదితర అంశాల నేపథ్యంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ రూ.339.50 కోట్లతో సవరించిన అంచనాలను ప్రభుత్వానికి సమర్పించారు. ఆ ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించిన ప్రభుత్వం రూ.337.90 కోట్లకు ఆమోదం తెలిపింది. పనుల నాణ్యత, నిబంధనలు, రేట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని అనంతపురం ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించింది. ఒప్పందం, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ధరల సర్దుబాటు లెక్కించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

## ప్రతి పంచాయతీలో వైసిపి జెండా ఎగురవేస్తాం



**చిట్వేలి** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మొదటి నుండి పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలకు నాయకులకు, రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో ప్రతి ఒక్కరికి అవకాశం కల్పిస్తామని రైల్వేకోడూరు మాజీ శాసనసభ్యులు, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. రైల్వే కోడూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కోడూరు మండల విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తలు నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హాయంలో మనం చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తూ ప్రజల దగ్గరకి వెళ్లి ఓటు అడిగే హక్కు మనకు ఉందని, ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా కలిసికట్టుగా ముందుకు వెళ్లి ప్రతి ఒక్క అభ్యర్థి గెలుపు కోసం కృషిచేసి గెలిపించుకొని, 2029లో కూడా వైయస్ జగన్మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రిగా చేసుకొని కోడూరు గడ్డ వైఎసిపి అడ్డాగా మరొక్కసారి నిరూపించుకుందామని అన్నారు. కూటమి నాయకులు గ్రామాల్లోకి వెళితే వాళ్లని తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఏవైనా సూచనలు సలహాలు ఉంటే మాకు తెలియజేస్తే అందరం కూర్చుని సమిష్టిగా మాట్లాడుకొని ముందుకు వెళదామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పంజం వేణుగోపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సిహెచ్. రమేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండల నాగేంద్ర, జిల్లా కో ఆప్షన్ సభ్యులు అన్వర్ భాష, జడ్పిటిసి రత్నమ్మ, ఎక్స్ ఎంపీపీ కనుపర్తి ఈశ్వరయ్య, మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, ముస్లిం మైనార్టీ స్టేట్ సెక్రటరీ ముజీబ్, రాఘవరాజు పురం మాజీ శివాలయం చైర్మన్ రవిచంద్ర రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుబ్బరామ రాజు, జిల్లా యూత్ సెక్రటరీ దమ్ము రఘు, జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ రాజా పాల్గొన్నారు

## వ్యవసాయ భూములను కబ్జాదారుల నుంచి కాపాడండి

**- కొంగర కుర్దు గ్రామ రైతుల విజ్ఞప్తి**

నకిలీ దస్తావేజులు సృష్టించి వ్యవసాయ భూములను రైతుల నుంచి బలవంతంగా లాక్కుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని పచ్చని పొలాలను పరిరక్షించాలని కొంగర కుర్దు గ్రామ రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు భూపాల్ రెడ్డి, పన్నాల యాది రెడ్డి, సమ్మి రెడ్డి కృష్ణా రెడ్డిలు మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కొంగర కుర్దు గ్రామంలోని 32 సర్వే నెంబర్ల పరిధిలో గల వ్యవసాయ భూములను గత 35 సంవత్సరాలుగా తాము వ్యవసాయం చేసుకుంటున్నట్లు తెలిపారు. కాగా గత రెండు నెలలుగా కొందరు భూ కబ్జాదారులు బినామీ పేర్లతో నకిలీ ఓ ఆర్ సి లను సృష్టించి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్, కందుకూరు ఆర్డీవో, మహేశ్వరం ఎమ్మార్వో కు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. కబ్జాదారులతో స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కుమ్మక్కై పచ్చని పొలాలను కబ్జాదారుల హస్తగతం చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల అండదండలతో రాత్రికి రాత్రే వ్యవసాయ పొలాల్లోకి అక్రమంగా చొరబడుతున్న కబ్జాదారులు పొలాలను నాశనం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి కబ్జాదారుల ఆగడాలను అరికట్టడంతో పాటు తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## ఆటలు మన శరీరాన్ని ఆరోగ్యంగా మనసును ఉత్సాహంగా ఉంచుతాయ

**- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కలకొండ రవీందర్ రెడ్డి**

**కోహెడ** సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోహెడలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎఎఫ జిఎఫ్ అండర్ 19 వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మరియు ఎస్జీఎఫ్ జిల్లా కన్వీనర్ కలకొండ రవీందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ. ఆటలు కేవలం సమయం గడపడా నికి మాత్రమే కాదని, ఇవి మన శరీరాన్ని ఆరోగ్యంగా, మనసును ఉత్సాహంగా ఉంచుతాయి. ఆటల ద్వారా మనలో ఐకమత్యం, నాయకత్వ లక్షణాలు, మరియు క్రమశిక్షణ పెరుగుతాయని, గెలుపు ఓటముల కంటే మనం ప్రదర్శించే క్రీడా స్ఫూర్తి చాలా ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బందెల సుజాత- బాలకిషన్ హాజరై ఆమె మాట్లాడుతూ. జిల్లా స్థాయి క్రీడలు మన ప్రాంతంలో జరగడం ఆనందదాయకమని క్రీడా స్ఫూర్తిని అందరూ పాటించి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ అండర్ 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏం.సమ్మయ్య, ఉమ్మడి జిల్లా నుండి వివిధ కళాశాలలో పిడిలు, ఇన్చార్జిలు, అధ్యాపకులు, క్రీడాకారులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాప్రశ్న



# భార్యను రోకలి బండతో కొట్టి హత్య



**హైదరాబాద్** హైదరాబాద్లోని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధి (బాగ్లింగంపల్లి)లో దారుణం చోటుచేసుకుంది. తీవ్ర కుటుంబ కలహాల కారణంగా భార్యను భర్త రోకలి బండతో బాది దారుణంగా హతమార్చాడు. మృతురాలు తేజస్వి (28) భర్త ,కుప్పల నరేందర్ ఆర్టీసీ క్రాస్రోడ్స్లోని ఒక హోటల్ పని చేస్తున్నాడు. ఈ దంపతులు సుమారు 4 నెలల క్రితమే బాగ్లింగంపల్లికి వచ్చారు. వీరికి 5 ఏళ్ల కుమారుడు (లోహిత్) ఉన్నాడు. ఆదివారం ఉదయం దంపతుల మధ్య కుటుంబ విషయమై తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆవేశంతో రగిలిపోయిన నరేందర్.. ఇంట్లోని రోకలి బండతో భార్య తలపై బలంగా బాదాడు. తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి ఇన్స్పెక్టర్ ఎల్. మధుబాబు బృందం ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

## ఈడీ కార్యాలయాన్ని ముట్టడించిన బీఆర్ఎస్

**హైదరాబాద్** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈడీ కార్యాలయానికి వెళ్లారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై ఈడీ రైడ్స్ జరిగి రెండు సంవత్సరాలు పూర్తయినా ఎందుకు వివరాలు బయటపెట్టడం లేదని నిరసనకు దిగారు. కార్యాలయం లోపలికి వెళ్లకుండా ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, కేపీ వివేకానందలను, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్ కుమార్ రెడ్డిలను పోలీసులు అడ్డుకున్నారు.

# బస్సు బోల్తా.. విద్యార్థులు క్షేమం



**జోగులాంబ** జోగులాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మానవపాడు మండలం బోరవెల్లి వద్ద విద్యార్థులతో వెళ్తున్న ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. బస్సు వేగంగా వెళ్తున్న సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో 37 మంది విద్యార్థులు వున్నారు. అదృష్టవశాత్తూ వారంతా ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. వీరంతా తమిళనాడు సేలంలోని హోలీక్రాస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు.

# నీట మునిగిన కాకినాడ

**- ప్రొక్లెయిన్పై పరిశీలించిన అధికారులు**

**కాకినాడ**దగాడేరు డ్రెయిన్ పొంగడంతో కాకినాడ నీట మునిగింది. మూడు రోజులుగా నీటి ముంపులోనే ప్రజలు వుండిపోయారు. కాకినాడ నగరంలో ముంపులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో కమిషనర్, తహసీల్దార్, ఇతర అధికారులు బాధితుల వద్దకు జేసీబీపై వెళ్లారు. 48, 49 డివిజన్లు ఇంకా నీటిలోనే వుండిపోయాయి.

# విద్యుత్ ఉద్యోగిపై కర్రతో దాడి

విద్యుత్ వినియోగదారుడు, విద్యుత్ ఉద్యోగిపై దాడి చేసిన ఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరి గింది.వివరాల్లోకి వెళితే ..సరూర్ నగర్ పోచమ్మబాగు చెందిన శివ నివా సంలో ఓ ఫేజ్ కరెంటు రాకపోవ డంతో ఆదివారం ఉదయం సంబం ధిత అధికారులకు ఫిర్యా దు చేశాడు. అదే సమయంలో విద్యుత్ అధికా రులు మరో పనులపై ఉన్న నేప థ్యంలో వీరి ఇంటి కరెంటు సరఫ రాను పునరుద్ధరించడంలో ఆలస్యం జరిగింది. దీంతో సదరు వినియోగదా రుడు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే కోపంతో సరూర గర్ విద్యుత్ ఏఈ కార్యాలయానికి చేరుకుని ఆపరేటర్ శివ వాగ్వాదా నికి దిగాడు. ఈ సమాచారం అందు కున్న ఏఈతో పాటుగా గ్రీన్పార్కు కాలనీకి చెందిన విద్యుత్ ఉద్యోగి రాజి రెడ్డి సరూర్ నగర్ సెక్షన్ కార్యాలయా నికి చేరుకున్నారు. సమస్య ఏంటని ప్రశ్నిస్తున్న క్రమంలోనే వినియోగదా రుడు శివ తీవ్రమైన పదజాలంతో రాజిరెడ్డిని దూషించడంతో పాటు తీవ్ర ఆగ్రహానికి గురై ఓ కర్రతో రాజి రెడ్డిపై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలకు గురైన రాజిరెడ్డి సరూర్న గర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సరూర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అధికారులు సమన్వయంతో

# విధులు నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా**

**- సిఎంఓ అధికారులతో కలెక్టర్, సిపి సమీక్ష**





**కరీంనగర్** కరీంనగర్ నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో అధికారులు తప్పిదాలకు ఆస్కారం లేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. ఈ నెల 30న ముఖ్యమంత్రి కరీంనగర్ జిల్లా పర్యటన నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయ సెక్యూరిటీ అధికారులు, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి హెలిప్యాడ్, నూతన కలెక్టరేట్ భవనం, కలెక్టరేట్ పరిసరాలను తనిఖీ చేశారు. సిపి,సీఎమ్ఓ అధికారులతో పర్యటనకు సంబంధించిన పలు విషయాలను చర్చించారు.అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. వివిధ శాఖల అధికారులు తమ కేటాయించిన విధులను సమన్వయంతో తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు.నిర్దిష్ట సమయంలో పనులు పూర్తి చేయాలని,ఎలాంటి తప్పిదాలకు తావు ఇవ్వరాదని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ముఖ్యంగా రోడ్లు భవనాలు, అటవీ శాఖ, ఎలక్ట్రిసిటీ, ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అన్నారు.వారికి కేటాయించిన విధులను పూర్తి చేసి సర్టిఫై చేయాలని ఆదేశించారు. సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు: పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం:సిపి గౌస్ ఆలం మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఉంటుందని తెలిపారు. హెలిపాడ్, సీఎం కాన్వాయ్, గౌరవ వందనం, సెక్యూరిటీ తదితర అంశాలపై పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రికి స్వాగతం మొదలుకొని తిరిగి హెలికాప్టర్ బయలుదేరే వరకు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులంతా తమకు కేటాయించిన విధులు నిర్వహించాలని, పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటన కోసం విధులు కేటాయించిన రోప్ సిబ్బంది, రూట్ ఆఫీసర్లు ప్రముత్తంగా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అవసరమైన చోట భారీ కేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు.సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, సీఎంఓ ఇంటలిజెన్స్ సెక్యూరిటీ అధికారులు ఎస్పీ రామచందర్ రావు, డిఎస్పి శ్యామ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 2029 ఎన్నికల్లోగా మంగళగిరిలో

# ప్రతి గడపకు తాగునీటి కనెక్షన్

- భూగర్భ డ్రైనేజి, అండర్ గ్రౌండ్ గ్యాస్ కనెక్షన్ కూడా పూర్తి చేస్తాం
- వచ్చే ఏడాది వంద పడకల ఆసుపత్రి ప్రారంభిస్తాం
- మంగళగిరి నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం పోటీ మొదలైంది
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించండి
- మూడో విడత పట్టాల పంపిణీలో మంత్రి నారా లోకేష్
- మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమంలో 372మందికి శాశ్వత పట్టాలు

**తాడేపల్లి:** మంగళగిరిలో 2029 ఎన్నికల లోపు ప్రతి గడపకి తాగునీటి కనెక్షన్, అండర్ గ్రౌండ్ గ్యాస్ కనెక్షన్, భూగర్భ డ్రైనేజి పూర్తిచేసే బాధ్యత నేను తీసుకుంటా, ఆనాడు ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉన్నానని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. తాడేపల్లి మండలం కుంచనపల్లి శ్రీశ్రీనివాస కన్వెన్షన్స్ లో మన ఇల్లు ? మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా మంత్రి లోకేష్ చేతుల మీదుగా 372మందికి శాశ్వత పట్టాలు, పిఎంఎవై మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మంగళగిరిలో 100 పడకల ఆసుపత్రి ఇక్కడ ప్రజల దశాబ్దాల కల. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎవ్వరూ ఊహించని రీతిలో రాష్ట్రంలోనే తొలిసారిగా ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. వచ్చే సంవత్సరం మొదటి మూడు నెలల్లో ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకి అంకితం చేసే బాధ్యత మేం తీసుకుంటాం. మహానాడు కట్టకి రిటైనింగ్ వాల్, భూగర్భ డ్రైనేజి, తాగునీటి సమస్యకు శాశ్వతమైన పరిష్కారం కావాలని ఎన్నికల సమయంలో అడిగారు. వాటిని ప్రణాళికా బద్ధంగా చేపట్టి, పూర్తి చేస్తాం. అత్యధిక మెజారిటీ నా బాధ్యత పెంచిందినేను మంగళగిరిలో పుట్టకపోయినా 2019లో మంగళగిరి నా సొంత ఊరుగా భావించి ఇక్కడ ఎమ్మెల్యేగా పోటీచేశా. ఇక్కడ ప్రజలను అర్థం చేసుకునేలోపే ఎన్నికలు అయిపోయాయి, 5300 ఓట్ల తేడాతో నేను ఆనాడు ఓడిపోయా. ఆ ఓటమి నాలో కసి పెంచింది. ఐదు సంవత్సరాలు కష్టపడి మీ మనసు గెలుచుకొని ఇక్కడనుంచే శాసనసభ్యుడిగా అసెంబ్లీకి వెళ్లాలని నిర్ణయించుకున్నా. ఎన్నికల ప్రచారంలో ఎన్ని ఓట్లతో నేను 2019లో ఓడిపోయానో, దానిపక్కన ఒక్క సున్నా పెట్టి ఆ మెజారిటీతో నన్ను గెలిపించాలని కోరా. మీరు నన్ను ఎంత ఎక్కువ మెజారిటీతో గెలిపిస్తే అంత బలం వస్తుంది, చంద్రబాబు, పవనన్నతో పోరాడి నిధులు తెస్తానని ఆనాడు హామీ ఇచ్చా. మీ ఆశీస్సులతో ఆంధ్రరాష్ట్ర చరిత్రలోనే టాప్-3 మెజారిటీతో విజయం సాధించా. నేను 53వేల మెజారిటీ అడిగితే, 92వేల ఓట్ల ఆధిక్యతతో నన్ను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించారు. మీరిచ్చిన మెజారిటీతో నా బాధ్యత పెరిగింది. ఆనాటి నుంచి అహర్నిశలు మంగళగిరి ప్రజల గురించే ఆలోచిస్తున్నా.

**రూ.2వేల కోట్ల ఆస్తి పంపిణీ చేశాం** 2019 ఎన్నికల సమయంలో అనేకమంది నాయకులు మంగళగిరి ప్రజల ఇంటిపట్టాల సమస్యపై హామీ ఇవ్వాలని నన్ను కోరారు. ఆనాడు సమస్య అర్థం కాకపోవడంతో నేను హామీ ఇవ్వలేకపోయా. గత ఎన్నికల్లో గడపగడపకు వచ్చినపుడు దశాబ్దాలుగా ఇక్కడే జీవిస్తున్న వారితో మాట్లాడాక సమస్య అర్థమైంది. సొంత ఇల్లు ఒక ఎమోషన్. కుటుంబమంతా చెమటోడ్చి కష్టపడి ఇల్లు కట్టుకున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు ఆ ఇల్లు మీది కాదు, రేపు మాపో ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని ప్రతిక్షణం భయపెట్టే పరిస్థితి ఆనాడు ఉండేది. దానికి ఫుల్ స్టాప్ పెట్టేందుకే ఆనాడు నేను హామీ ఇచ్చారు. మూడోవిడత సుమారు 400 మందికి శాశ్వత పట్టాలు కల్పిస్తున్నది మీ కూటమి ప్రభుత్వం. బట్టలు పెట్టి పసుపు,కుంకుమలతో పట్టాలు ఇస్తానని ఆనాడు ఇచ్చిన హామీ ఈరోజు నిలబెట్టుకుంటున్నా. మొదటి విడతలో 3,002, రెండోవిడతలో 2,670, మూడోవిడతలో 388 పట్టాలు కలిపి మొత్తం సుమారు రూ.2వేల కోట్ల విలువ ఆస్తికి ప్రజలకు శాశ్వత హక్కులు కల్పించింది ప్రజాప్రభుత్వం.రాష్ట్రానికి దిక్సూచిగా మంగళగిరి మోడల్మంగళగిరి మొదటిపెట్టిన ప్రక్రియ ఈరోజు యావత్ రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోంది. మంగళగిరిలో పట్టాల సమస్యను నేను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినపుడు ఆంధ్రప్రదేశ్ లో ఈ సమస్య ఎక్కడున్నా పరిష్కరించాల్సి ఉందని ఆయన నాతో చెప్పారు. అధికారులు, నాయకుల కనీసం ఒక్క గ్లాసు మంచినీరు కూడా తీసుకోకుండా ఇళ్లకు వెళ్లి వివరాలు తీసుకున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు మేమంతా ఒక పట్టుదల, కమిట్ మెంట్ తో పనిచేస్తున్నాం. మంగళగిరిలో వేసిన పునాది ఆంధ్ర రాష్ట్రానికి దిక్సూచిగా మారింది. ఇటీవల విశాఖపట్నంలో 29వేల పట్టాలను ప్రజాప్రభుత్వం ప్రజలకు అందించింది. త్వరలో విజయవాడలో కూడా మరో 24వేలమందికి అందించబోతోంది. ఇది గౌరవ ముఖ్యమంత్రి గారికి పేదల పట్ల ఉన్న కమిట్ మెంట్.

## సీఐ అహ్మద్ అలీ కుటుంబాన్ని

# పరామర్శించిన విజయవాడ సీపీ..



ఏలూరు జిల్లా గోపన్నపాలెంలోని సీఐ అహ్మద్ అలీ ఇంటికి విజయవాడ పోలీస్ కమిషనర్ చేరుకుని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున, పోలీస్ శాఖ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు..

విజయవాడ సీపీతో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు నేడు గోపన్నపాలెం చేరుకుని అహ్మద్ అలీ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరిగేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు..

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్



**మరిపెడ :** మరిపెడ మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, నూతన రేషన్ కార్డులు, స్మార్ట్ కార్డుల పథకాల లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ చెక్కులు, సంబంధిత పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ డయాగ్నొస్టిక్ విసిట్ కార్యక్రమం



**చాగలమర్రి** చాగలమర్రి మండలంలోని శెట్టివీడు మరియు గొడిగనూరు గ్రామాలలోని పొలాలను నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నీలిమ , రాఘవేంద్ర మరియు ఆళ్లగడ్డ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయ్ శేఖర్ స్థానిక మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజీ ఆధ్వర్యంలో " ఫీల్డ్ డయాగ్నొస్టిక్ విసిట్" కార్యక్రమంలో భాగంగా మినుము, మొక్కజొన్న, వరి మరియు వేరుశనగ పంటలను పరిశీలించడం జరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో మినుము పంటలో రసం పీల్చే పురుగులు ఆశించకుండా ఇమిడాక్లోప్రిడ్ లేదా అక్టారా పురుగు మందును పిచికారి చేసుకోవాలని ఫలితంగా వైరస్ తెగులు వ్యాప్తి చెందకుండా ఉంటుందని తెలిపారు. అదే విధంగా వరి పంటలో నీటిని ప్రతీ వారం లేదా 15 రోజులకు ఒకసారి పూర్తిగా తీసివేసి పొలం ఆరిన తరువాత మళ్ళీ నీరు ఇవ్వాలని దీని ద్వారా సుడి దోమ వ్యాప్తిని తగ్గించవచ్చు అని తెలిపారు. వర్షాధార వేరుశనగ లేదా మినుము పంట సాగు చేసే రైతులు పంట బెట్ట పరిస్థితి ఎదురైనపుడు పొటాషియం నైట్రేట్ 10గ్రా లీ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. రైతులు సమగ్ర సస్య రక్షణ చర్యల ద్వారా సాగు చేయడం వలన నేల ఆరోగ్యం కాపాడటమే కాకుండా పెట్టుబడి తగ్గి మంచి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చును అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ. ఒ లు మంజుల మరియు రేవతి మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు ఉపేంద్ర, దేవేంద్ర మరియు రైతులు పాల్గొన్నారు.

# పాడి పశువులకు పశు బీమా ప్రారంభం

**- పాడి రైతులకు ఆర్థిక భరోసా. - పశువైద్యాధికారి బాలకృష్ణ.**



**తుగ్గలి:** పాడి రైతుల పశుసంపదకు రక్షణ కల్పించడంతో పాటు,పశువులు అనుకోని కారణాలతో మరణించిన సందర్భంలో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పశు బీమా పథకాన్ని మండల కేంద్రమైన తుగ్గలి నందు సోమవారం రోజున పశువైద్యాధికారి బాలకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా పాడి రైతు ఆంజనేయులు తన పాడి పశువులకు బీమా చేయించుకున్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి బాలకృష్ణ మాట్లాడుతూ ఈ పథకం కింద 15,000 బీమా విలువ కలిగిన పశువుకు మొత్తం ప్రీమియం రూ.960 కాగా,అందులో ప్రభుత్వ వాటా 816, రైతు వాటా 144 ఉంటుందని,అలాగే రూ.30,000 బీమా విలువ కలిగిన పశువుకు మొత్తం ప్రీమియం 1,920 కాగా,ప్రభుత్వ వాటా రూ.1,632, రైతు వాటా 288 ఉంటుందని,ఒక్క గొర్రెకు 6,000 భీమా మొత్తంగా నిర్ణయించబడిందని,ఒక్క గొర్రెకు భీమా ప్రీమియం 180 కాగా,ఇందులో ప్రభుత్వం 153 సబ్సిడీగా భరిస్తుంది.

రైతు తన వాటాగా కేవలం రూ.27 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలియజేశారు.పశువులు రైతుల కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్నందున, అనుకోని పశునష్టం సంభవించినప్పుడు ఈ బీమా పథకం ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. తుగ్గలి మండలంలోని పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పాడి పశువులకు బీమా చేయించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయ సిబ్బంది మురళి,జ్యోతి, పశు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## అక్కన్నపేటలో రైలు కిందపడి

# గుర్తుతెలియని వ్యక్తి మృతి



**రామాయంపేట** మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున విషాద ఘటన చోటుచేసుకుంది.అక్కన్నపేట రైల్వే ట్రాక్ పక్కన కృష్ణ ఎక్స్ప్రెస్ రైలు కిందపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు కామారెడ్డి రైల్వే ఎస్సై లింబాద్రి తెలిపారు.ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి వివరాలు ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలిస్తున్నట్లు వెల్లడించారు.మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే కామారెడ్డి రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని తెలియపరచారు

## విద్యార్థులకు ట్యాబ్‌లు, వికలాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



**మహబూబాబాద్** జిల్లా కలెక్టరేట్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు, వికలాంగులకు వీల్‌చైర్లను ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ గారు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని సూచించారు. వికలాంగులకు అవసరమైన సహాయ సహకారాలు అందించి, వారు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.విద్యార్థులు, వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, వికలాంగులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం

**సుద్దాల వంశీ, కోనేరు ప్రవీణ్ కుమార్**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) భగత్ సింగ్ జయంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని ఎడ్యుకేషన్ బాయ్స్ హబ్‌లో భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు సుద్దాల వంశీ, కార్యదర్శి కోనేరు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహోన్నత విప్లవ వీరుడని అన్నారు. యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యతతో పాటు శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంలో భగత్ సింగ్ ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.విద్యార్థులు భగత్ సింగ్ జీవిత చరిత్ర, ఆశయాలను అధ్యయనం చేసి, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే చైతన్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు బేగరీ చరణ్, డివిజన్ నాయకులు వంశీ, వినీల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మార్క్యాక్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ

**- క్రమశిక్షణ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం**

**- సీపీ రష్మి పెరుమాళ్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మర్క్యాక్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ సోమవారం సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు మర్క్యాక్ ఎస్ఐ యూనుస్ అహ్మద్ అలీ ఆధ్వర్యంలో సిబ్బంది పరేడ్ నిర్వహించారు. అనంతరం సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పోలీస్ స్టేషన్ ఆవరణలో కేసులకు సంబంధించిన వాహనాలను కమిషనర్ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులు, వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా సీపీ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, సమయపాలనను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రజలతో గౌరవప్రదంగా, నిబద్ధతతో వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓపికగా విని, త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో ‘సిద్దిపేట సురక్ష నేత్ర’ కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాల నిఘాను విస్తరించేలా ఎస్ఐ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ యువతకు ‘సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర’ కార్యక్రమంపై అవగాహన కల్పించి, వారికి సరైన దిశానిర్దేశం చేయాలని సూచించారు.విధుల్లో బిజీగా ఉంటూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని సిబ్బందికి సూచించిన సీపీ.. “నివారణే మేలైన మార్గం” అనే సూత్రాన్ని గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.అనంతరం పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సీపీ అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి విభాగం ఇన్‌చార్జి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు.ఈ వార్షిక తనిఖీలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు, గజ్వేల్ రూరల్ సీఐ రవి రాజు, మార్క్యాక్ ఎస్ఐ యూనుస్ అహ్మద్ అలీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నల్లగండ్ల హుడా లేఔట్‌లో లేబర్ షెడ్లపై ఆందోళన

**పెద్ద సంఖ్యలో కార్మికులు నివసించే అవకాశం ఉందంటూ భద్రతపై ఆందోళన**

శేరిలింగంపల్లి(ప్రశ్న న్యూస్)సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని నల్లగండ్ల హుడా లేఔట్‌లో కొత్తగా రెండు, మూడు లేబర్ షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఒక్కో షెడ్‌లో పెద్ద సంఖ్యలో కార్మికులు నివసించే అవకాశం ఉందని, కొన్ని షెడ్లలో 500 మంది వరకు ఉండవచ్చని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో కార్మికులు ఒకేచోట







నివసించడం వల్ల కాలనీ భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రభావం పడే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.లేబర్ షెడ్ల నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా.? నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నారా.? షెడ్లలో ఎంతమంది కార్మికులు నివసించేందుకు అవకాశం ఉంది? అనే అంశాలపై శేరిలింగంపల్లి సీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# బుచ్చిలో అభివృద్ధి పరుగులు

**- రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లకు శ్రీకారం- హామ్ కింద మరో రూ.22 కోట్లు.. - ఇప్పటివరకు రూ.58 కోట్ల పనులు**

**28 వార్డుల్లో సమగ్ర అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





బుచ్చిరెడ్డిపాళెం (ప్రశ్న న్యూస్) బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. మౌలిక వసతుల కల్పనలో భాగంగా 12, 13, 14, 15, 18వ వార్డుల్లో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శంకుస్థాపన చేశారు. అన్ని వార్డులకూ సమాన ప్రాధాన్యమిస్తూ పనులు చేపడుతున్నామని ఆమె తెలిపారు.

### రూ.22 కోట్లతో మరిన్ని పనులు

బుచ్చి మున్సిపాలిటీలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కోసం హామ్ పథకం కింద రూ.22 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే ఏడాది కాలంలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఇప్పటివరకు మున్సిపాలిటీ పరిధిలో రూ.58 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు.

### శంకుస్థాపనలకే పరిమితం కాదు

కూటమి ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వదిలేసే ప్రభుత్వం కాదని, ప్రారంభించిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ప్రశాంతి రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సహకారంతో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు.

### 28 వార్డుల్లో గెలుపే లక్ష్యం

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బుచ్చిరెడ్డిపాళెంలోని 28 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

### రేపు ఉదయగిరిలో సీఎం, డిప్యూటీ సీఎం

ఈ నెల 29న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు మండలం రామాపురంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.
‘పల్లె ప్రగతి 3.0’లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారని చెప్పారు. కార్యక్రమానికి ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# యోగతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

**ఒత్తిడి, టెన్షన్ నుంచి ఉపశమనానికి యోగాభ్యాసం ఎంతో అవసరం**







హైదరాబాద్(ప్రశ్న న్యూస్)ప్రస్తుత ఆధునిక జీవన విధానంలో ఒత్తిడి, టెన్షన్, ఆందోళనతో పాటు అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిరోజూ యోగాభ్యాసం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సీనియర్ యోగ ప్రచారకులు సత్తయ్య సూచించారు.భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, భాగ్యనగర్ దక్షిణ జిల్లా అధ్యక్షుడు అనిల్ జి, సీనియర్ యోగ ప్రచారకులు హాలిడే సత్తయ్య, యువభారత్ నరాచారి ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామి రాందేవ్ బాబా దివ్య ఆశీస్సులతో ఈ కార్యక్రమాల్లో 18 మంది సభ్యులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.ఈ బృందంలో లక్ష్మారెడ్డి, రాజేష్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పురుషోత్తం, మైపాల్‌రెడ్డి, ఏ. జితేందర్‌రెడ్డి, ఏ. గోపాల్‌రెడ్డి, కే. వెంకటయ్య, కే. పెంటయ్య, పి. తిరుపతయ్య, జయశంకర్, కోఆర్డినేటర్ రామయ్య తదితరులు ఉన్నారు.పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా యోగ శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం తదితర పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకరమైన జీవన విధానం వైపు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. నిత్య యోగాభ్యాసం ద్వారా శరీర దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందించుకోవచ్చని, ఒత్తిడి, టెన్షన్ వంటి సమస్యలను ఎదుర్కోవడంలో యోగ ఉపయోగపడుతుందని సీనియర్ యోగ ప్రచారకులు పేర్కొన్నారు. అయితే ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహాతో పాటు తగిన విధంగా యోగాభ్యాసం చేయాలని సూచించారు. ప్రతి కుటుంబంలో యోగాభ్యాసం ఒక నిత్య కార్యక్రమంగా మారాలి. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగ ఎంతో దోహదపడుతుంది” అని వారు తెలిపారు.

# కీసర పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు

**- 25 రోజులు గడిచినా అజయ్ ఆచూకీ ఎక్కడ.?- కీసర పోలీస్ స్టేషన్ మిస్సింగ్ కేసు గంధమల్ల అజయ్ ఆచూకీ దొరికేనా.?**

**- పోలీసుల దర్యాప్తు తీరుపై బాధిత కుటుంబం ఆందోళన-25 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన**

**- ఉన్నత అధికారులు వెంటనే స్పందించి కింది స్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చిన విచారణ మాత్రం తూతూ మంత్రంగానే జరుగుతోంది**

**- 04/09/26 గంధమల్ల శంకర్ కీసర పోలీస్ స్టేషన్లో తన కొడుకు గంధమల్ల అజయ్ కనిపించడం లేదు అని**







కీసర ( ప్రశ్న న్యూస్) కీసర పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి 25 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు అని తమ కుటుంబ సభ్యుడి ఆచూకీ కోసం ఎదురుచూస్తున్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన సమాచారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తుడుం శ్రీనివాస్ అన్నారు.
ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టినప్పటికీ, ఇప్పటివరకు దర్యాప్తు నామమాత్రంగానే సాగుతోందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని, రోజులు గడుస్తున్న కొద్దీ తమ ఆందోళన మరింత పెరుగుతోందని, పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేసి ఆచూకీ కనిపెట్టాలని వారు కోరుతున్నారన్నారు. కేసు పెట్టి 25 రోజులు అంటే ఒక కుటుంబానికి ఇకనైనా పోలీసు అధికారులు ఈ కేసును అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని, ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అందుబాటులో ఉన్న సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, ఫోన్ వివరాలు తదితర అంశాలను పరిశీలించి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించానా కింది స్థాయి అధికారులు మాత్రం తు తు మంత్రంగా వ్యవహరిస్తున్నారు అంటూ కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తుందని తెలిపారు. బాధిత కుటుంబాలకు ఒక్క అమ్మాయి ఫోన్ చేసి, అజయ్ కోసం ఏమైంది అని పదే పదే అడగడం? పోలీసులు అమ్మాయి కుటుంబ సభ్యులను కనీసం విచారణ చేయకుండా నిర్లక్ష్యం చేయడం, బాధిత కుటుంబానికి కూడా అమ్మాయి, మరియు వల్ల కుటుంబం మీద అనేక అనుమానాలు ఉన్నాయి అని అన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు అన్ని కోణాలలో విచారణ చేయాలని కుటుంబ సభ్యులు కో కోరుతున్నారన్నారు. కీసర పోలీసులు కేసును పూర్తిస్థాయిలో విచారణ చేస్తారా లేక గాలికి వదిలేస్తారా వేచి చూడాలి.

# 'షాక్' సిరీస్ రివ్యూ!



పరిణీతి చోప్రా ప్రధానమైన పాత్రను పోషించిన వెబ్ సిరీస్ 'షాక్: ట్రస్ట్ నో వన్'. స్వప్న మల్హోత్రా - సిద్ధార్థ్ మల్హోత్రా సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకి, రెన్సిల్ డిసిల్వా దర్శకత్వం వహించాడు. హిందీలో రూపొందిన ఈ సిరీస్, తెలుగుతో పాటు ఇతర భాషల్లోను ఈ నెల 24వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. మిస్టరీ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన ఈ సిరీస్ కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. అన్విత (పరిణీతి చోప్రా) .. అలోక్ (తాహిర్ రాజ్ భాసిన్) భార్యాభర్తలు. 'సిమ్లా'లో వాళ్ల లైఫ్ హ్యాపీగా సాగిపోతూ ఉంటుంది. అక్కడి హాస్పిటల్లో 'భాస్కర్' (సుమిత్ వ్యాస్) డాక్టర్ గా పనిచేస్తూ ఉంటాడు. ఆయన భార్య శ్రేయ (హర్లీన్ సేథీ) ఇద్దరూ కూడా అలోక్ ఫ్యామిలీకి స్నేహితులుగా ఉంటారు. అన్వితకి నెలలు నిండటంతో, భాస్కర్ హాస్పిటల్లోనే చేరుస్తారు. అక్కడే ఆమె ఒక పాపకి జన్మమిస్తుంది. ఆ పాపకి 'అపేక్ష' అనే పేరు అనుకుంటారు. అయితే ఊహించని విధంగా హాస్పిటల్ నుంచి 'అపేక్ష' మాయమవుతుంది. హాస్పిటల్ కి సంబంధం లేని ఒక లేడీ, నర్స్ వేషంలో వచ్చి పాపని తీసుకెళ్లిపోయిందనే విషయాన్ని తెలుసుకుంటారు. కాకపోతే ఒక వైపున సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో, ఆమె ఎవరనేది కనుక్కోలేకపోతారు. అలా ఎనిమిదేళ్లు గడిచిపోతాయి. అన్విత - అలోక్ దంపతులకు 'సిద్ధి' అనే మరో పాప పుడుతుంది. అయినా అన్విత మాత్రం 'అపేక్ష'ను మరిచిపోలేకపోతుంది. తన కూతురు బ్రతికే ఉందనీ, తన ఆచూకీ తప్పకుండా తెలుస్తుందనే నమ్మకంతో ఉంటుంది. ఈ నేపథ్యంలో అన్విత అత్తగారు 'మాధురి' తరచూ ఒక మాంత్రికుడిని కలుస్తూ ఉంటుంది. అతనితో క్షుద్రపూజలు చేయిస్తూ ఉంటుంది. అపేక్ష నష్ట జాతకురాలు కావడం వలన, ఆ పాప తిరిగొస్తే తన కొడుక్కి ప్రమాదని భావించి ఆమె అలా చేయిస్తూ ఉంటుంది. ఇక భాస్కర్ కి తెలియకుండా శ్రేయ, అన్వితకి తెలియకుండా అలోక్ రహస్యంగా కలుసుకుంటూ ఉంటారు. అక్రమసంబంధాన్ని కొనసాగిస్తూ ఉంటారు. నందిని అనే ఒక పాపను ఒక శరణాలయంలో ఉంచి చదివిస్తూ ఉంటుంది శ్రేయ. ఇలాంటి పరిస్థితులలోనే కొత్తగా సిమ్లాకి గౌరవ్ - సాక్షి దంపతులు వస్తారు. వాళ్ల పాప 'రియా'ను చూడగానే, అన్వితకి ఆ పాప తన కూతురు అపేక్ష కావొచ్చనే అనుమానం కలుగుతుంది. అప్పటి నుంచి వాళ్లను సందేహించడం మొదలుపెడుతుంది. ఇదే విషయాన్ని పోలీస్ ఆఫీసర్ 'ఖురానా'తో చెబుతుంది. దాంతో అతను కూడా వాళ్లపై ఒక కన్నేసి ఉంచుతాడు. అన్విత బిడ్డను కిడ్నాప్ చేసింది ఎవరు? అందుకు గల కారణం ఏమిటి? తన బిడ్డ కోసం ఆమె చేసే పోరాటం ఫలిస్తుందా? అనేది మిగతా కథ.ఇది ఒక తల్లి కథ .. హాస్పిటల్ నుంచి కిడ్నాప్ చేయబడిన తన కూతురు తన దగ్గరికి తప్పకుండా తిరిగొస్తుందని నమ్మిన ఒక తల్లి కన్నీటి కథ. తన మానసిక స్థితి సరిగ్గా లేదని జనమంతా చెప్పుకుంటున్నా పట్టించుకోకుండా, తన కూతురు కోసం ఎనిమిదేళ్లుగా అన్వేషణ కొనసాగిస్తూ ఆవేదనతో చేసే ప్రయాణం కథ ఇది. తల్లీకూతుళ్ల ఎమోషన్స్ ప్రధానంగా దర్శకుడు రాసుకున్న ఈ కథలో, అక్కడక్కడా రొమాన్స్ టచ్ ఇస్తూ వెళ్లారు.ఈ కథలో అన్విత - అలోక్ దంపతులు, భాస్కర్ - శ్రేయ దంపతులు, గౌరవ్ - సాక్షి దంపతులు ప్రధానమైన పాత్రలుగా కనిపిస్తారు. ఈ మూడు జంటలను కలుపుతూ వెళ్లిన కథ, మొదటి నుంచి చివరివరకూ చాలా ఆసక్తికరంగా సాగుతుంది. ఆడియన్స్ గెస్ చేయలేని విధంగా కథ అనేక మలుపులు తీసుకుంటూ ముందుకు వెళుతుంది. ఇక అన్విత అత్తగారు చేయించే క్షుద్రపూజలు ఈ కథ పట్ల మరింత కుతూహలం పెరగడానికి కారణమవుతుంది. ప్రధానమైన పాత్రలను కలుపుకుంటూ సాగే కీలకమైన పాత్రగా పోలీస్ ఆఫీసర్ 'ఖురానా' కనిపిస్తాడు. ఎలాంటి టెస్టులు లేకుండానే ఒక తల్లి, పసికందుగా ఉన్నప్పుడు తప్పిపోయిన తన కూతురును గుర్తించగలదని భావించిన ఆయన, ఆమెకి పూర్తి అండగా నిలబడటం ఈ కథకు మరింత బలాన్ని ఇస్తుంది. మొత్తం 7 ఎపిసోడ్స్ లో ప్రతి ఎపిసోడ్ కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. ఎక్కడా ఏ ఎపిసోడ్ బలహీనపడినట్టుగా అనిపించదు. ప్రతి ఎపిసోడ్ బ్యాంగ్ ఆ తరువాత ఎపిసోడ్ పై ఉత్కంఠను పెంచుతుంది. ఇక ప్రతి పాత్రను మలిచిన విధానం ఆకట్టుకుంటుంది. ఆ పాత్రలను ఎత్తుకున్న తీరు .. చివరివరకూ నడిపించిన తీరు చాలా సహజంగా అనిపిస్తుంది. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ కథను మరింత పట్టుగా .. పకడ్బందీగా పరుగులు తీయించాయి. ఈ సమయంలో చోటుచేసుకునే ట్విస్టులు కదలనీయకుండా చేస్తాయి. కథ .. కథనం ఈ సిరీస్ ను బలంగా నిలబెడతాయి.

నిర్మాణ విలువలు ఈ సిరీస్ భారీతనాన్ని నిలబెడతాయి. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ చాలా నీట్ గా సాగుతాయి. ఆశలు .. వ్యామోహాలు జీవితాన్ని ఏ దిశగా తీసుకుని వెళతాయి? మూఢనమ్మకాలు జీవితంలో ఎలాంటి కల్లోలాన్ని సృష్టిస్తాయి? ప్రతీకారం వలన చివరికి సాధించేదేముంటుంది? అనే విషయాలను ఈ కథలో ఆవిష్కరిస్తూ వెళ్లిన తీరు ఆకట్టుకుంటుంది. ఒక తల్లి తన బిడ్డ కోసం ఎవరితోనైనా పోరాడుతుంది. ఎంతకాలమైనా పోరాడుతుంది అనే సందేశం ఆడియన్స్ కి కనెక్ట్ అవుతుంది. ఒకటిరెండు చోట్ల కాస్త అభ్యంతరకరమైన సన్నివేశాలు ఉన్నాయి. వాటిని పక్కన పెట్టి చూస్తే, ఈ మధ్య కాలంలో వచ్చిన ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ లలో ఒకటిగానే ఇది మిగిలిపోతుంది.

## హీరో భార్యకు నచ్చలేదని నన్ను తీసేశారు: తాప్సీ



ప్రముఖ నటి తాప్సీ తన కెరీర్ ఆరంభంలో బాలీవుడ్లో ఎదుర్కొన్న కొన్ని అవమానకరమైన అనుభవాలను పంచుకున్నారు. హీరో భార్యకు తాను నచ్చలేదనే వింత కారణంతో తనను ఓ సినిమా నుంచి తనను తొలగించారని వెల్లడించారు. ఇటీవల నయన్‌దీప్ రక్షిత్‌కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాప్సీ ఈ షాకింగ్ విషయాలను పంచుకున్నారు. తాప్సీ మాట్లాడుతూ, "ఓ సినిమాకు సంతకం చేసిన తర్వాత నన్ను తొలగించారు. కారణం ఏంటని అడిగితే, 'హీరో భార్యకు మీరు నచ్చలేదు' అని చెప్పారు. ఆ హీరో భార్యకు నేనెందుకు నచ్చలేదో ఇప్పటికీ నాకు తెలియదు" అని గుర్తుచేసుకున్నారు. అయితే ఆ నటుడు, ఆయన భార్య ఎవరనేది మాత్రం ఆమె వెల్లడించలేదు. మరో సందర్భంలో, ఓ ప్రముఖ హీరో తన స్థానంలో అతడికి బాగా సన్నిహితురాలైన నటిని తీసుకోవడం కోసం తనను సినిమా నుంచి తప్పించారని తాప్సీ పేర్కొన్నారు. అదే సమయంలో, పరిశ్రమలో నటీనటులను ఒకేరకమైన పాత్రలకు పరిమితం చేసే (టైప్ కాస్ట్) ధోరణిపై కూడా తాప్సీ స్పందించారు. కొందరిని గ్లామర్ పాత్రలకు, మరికొందరిని సీరియస్ పాత్రలకు పరిమితం చేస్తారని, తన విషయంలో అలా జరగకుండా ఉండేందుకే కొన్ని ఆఫర్లను స్పష్టంగా తిరస్కరిస్తున్నానని ఆమె తెలిపారు. కాగా, తాప్సీ ఇటీవల 'అస్సి', 'గాంధారి' వంటి చిత్రాల్లో తన నటనతో ప్రశంసలు అందుకున్నారు.

## అమ్మ మనసును ఆవిష్కరిస్తూ..




అమ్మ స్థానాన్ని మించిన స్థానం ఈ జగత్తులో మరొకటి ఉండదు. ఓ స్త్రీ వృత్తి పరంగా ఎంత గొప్ప స్థానంలో ఉన్నా.. వ్యక్తిగతంగా అమ్మ స్థానానికి ఇచ్చేదే అసలైన విలువ. తాజాగా గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా తన సోషల్ మీడియా వేదికగా పంచుకున్న ఓ ఫన్నీ వీడియో ఈ విషయాన్నే వ్యక్తపరుస్తున్నది. 40ఏండ్ల వయసులో మాతృత్వంలోకి అడుగుపెట్టిన తర్వాత బిడ్డ పెంపకంలో పడిపోయి, చిన్న చిన్న విషయాలను కూడా అమ్మ ఎలా మరిచిపోతుందో ఈ వీడియోలో సహజంగా చూపించారు. రోజువారీ పనులు చేస్తూనే, వస్తువులు ఎక్కడ పెట్టామో హటాత్తుగా మర్చిపోవడం వంటి 'మామ్ బ్రెయిన్' ఘట్టాలతో భావోద్వేగ పూరితంగా, వినోదాత్మకంగా ఈ వీడియా సాగింది. పిల్లల పెంపకంలో నిమగ్నమైన తల్లి మానసిక పరిస్థితిని అద్దం పడుతున్న ఈ వీడియో.. ప్రియాంక షేర్ చేసిన క్షణాల్లో వైరల్ కావడం విశేషం. ముఖ్యంగా తల్లులు ఈ వీడియోపై కామెట్ల వర్షం కురిపిస్తున్నారు. 2022లో సరోగసీ ద్వారా మాల్టీ మేరీకి ప్రియాంక జన్మనిచ్చిన విషయం తెలిసిందే. అంతర్జాతీయంగా బిజీగా ఉన్నప్పటికీ, బిడ్డను మాత్రం వెంటతీసుకునే వెళ్తుంటారు ప్రియాంక. ఈ విషయంలో చాలామంది

## రామాయణ దృశ్యమాలిక



ఎన్నిమార్లు విన్నా.. ఎన్నిసార్లు కన్నా.. తనివితీరని పుణ్యగాథ 'రామాయణం'. అది మన దేశ సంపద. మన అస్తిత్వానికి ప్రతీక. అందుకే.. ఎన్నిసార్లు తెరకెక్కినా ఈ దృశ్యకావ్యాన్ని చూసేందుకు జనం సిద్ధంగానే ఉంటారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో దాదాపు 3వేల కోట్ల భారీ నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా 'రామాయణం' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. నితీశ్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈచిత్రంలో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తుండగా, రావణబ్రహ్మగా 'కేజీఎఫ్'ఫేం యశ్ కనిపించనున్నారు. తొలి భాగం దీపావళి కానుకగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈసినిమా ప్రమోషన్స్‌ని మేకర్స్ వేగవంతం చేశారు. ఆదివారం ఈ సినిమా నుంచి రెండు పోస్టర్లను విడుదల చేశారు. అందులో తొలి పోస్టర్ సీతారామలక్ష్మణులది కాగా, రెండో పోస్టర్ రావణబ్రహ్మది. వనవాసకాలంలో సీతాలక్ష్మణ సమేతంగా ధనుర్బాణాలతో కనిపిస్తున్న రామచంద్రమూర్తిని తొలిపోస్టర్‌లో చూడొచ్చు. రాముడిగా రణబీర్‌కపూర్, సీతగా సాయిపల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. ఇక సర్వాలంకారభూషితుడైన రావణబ్రహ్మగా యశ్‌ని రెండో పోస్టర్‌లో చూడొచ్చు. మహాశక్తివంతుడు, బ్రహ్మజ్ఞాని, లంకాధీశుడైన రావణుడ్ని ఈ పోస్టర్‌లో అద్భుతంగా ఆవిష్కరించారు. ఇందులో రావణపత్ని మండోదరిగా కాజల్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్న విషయం తెలిసిందే.

## కనుమరుగైన నిజాలను బహిర్గతం చేస్తూ..



అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం విజయ దశమి కానుకగా అక్టోబర్ 16న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన ప్రకటనను మేకర్స్ విడుదల చేశారు. "రణబాలి' నెవర్ ఫర్ గెట్ ట్రూత్' పేరుతో 4 ఎపిసోడ్స్ గల డాక్యుమెంటరీ సిరీస్‌ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్టు వారు ప్రకటించారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ నెల 28న తొలి ఎపిసోడ్ 'ది ఫెమైన్ వి ఫర్ గాట్' స్ట్రీమింగ్ కానున్నది. ఈ నెల 30న రెండో ఎపిసోడ్ 'ది హిస్టరీ వి ఫర్ గాట్', అక్టోబర్ 2న మూడో ఎపిసోడ్ 'ది మెన్ వి ఫర్ గాట్' స్ట్రీమింగ్ కానున్నాయి. ఇక నాలుగో ఎపిసోడ్ 'ది లాస్ట్ లోడ్' స్ట్రీమింగ్ డేట్‌ని త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. చరిత్రకు రెండు పార్శ్వాలుంటాయి. ఒకటి మనకు చెప్పింది. మరొకటి ఎవరికీ తెలియకుండా సమాధి చేయబడింది. అలా చరిత్రలో కనుమరుగైన నిజాలను ఈ నాలుగు ఎపిసోడ్స్ బహిర్గతం చేయనున్నాయని మేకర్స్ తెలిపారు. 'రణబాలి' ప్రపంచం నుంచి ఎక్స్‌క్లూజివ్ బిహైండ్ ది సీన్స్ కంటెంట్‌తో ఈ డాక్యుమెంటరీ సిరీస్ రాబోతున్నది.

## ప్రేమతో కూడిన హృదయం

తమిళ అగ్ర నటుడు విజయ్ సేతుపతి ప్రధానపాత్రలో టాలీవుడ్ ఫిల్మ్ మేకర్ పూరీ జగన్నాథ్ తెరకెక్కించిన పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'స్లమ్ డాగ్ : 33 టెంపుల్ రోడ్'. త్వరలో సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సినిమా ప్రచారాన్ని మేకర్స్ వేగవంతం చేశారు. తాజాగా ఇందులో కీలకపాత్ర పోషిస్తున్న జరీనా వహాబ్ ఫస్ట్‌లుక్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. 'ప్రేమతో కూడిన హృదయం.. పోరాటాలతో నిండిన జీవితం' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో పొందుపరచిన క్యాప్షన్ జరీనా వహాబ్ పాత్రపై, ఈ సినిమా కథపై ఆసక్తిని పెంచింది. ఇందులో ఆమె జుబైదాగా కనిపించనున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా, దునియా విజయ్ విలన్‌గా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రానికి కెమెరా: సామ్ కె.నాయుడు, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, నిర్మాతలు: పూరీ జగన్నాథ్, చార్మీకౌర్, జె.బి.నారాయణ్‌రావు కొండ్రోళ్ల, నిర్మాణం: పూరీ కనెక్ట్స్.



## 'ఆదర్శకుటుంబం' వేరే లెవెల్

'దాదాపుగా 20ఏళ్ల తర్వాత త్రివిక్రమ్‌తో కలిసి పనిచేశాను. తను రచన చేసిన నువ్వునాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలు క్లాసిక్ లవ్‌స్టోరీలుగా నిలిచాయి. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత నాకోసం అద్భుతమైన కథను తెచ్చారు త్రివిక్రమ్. ఇందులో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. ఊహించని ట్విస్టులుంటాయి. ట్రీట్మెంట్ కొత్తగా ఉంటుంది. 'ఆదర్శకుటుంబ' మామూలు కుటుంబం కాదు. ఇది వేరే లెవెల్. త్రివిక్రమ్ అద్భుతంగా హ్యాండిల్ చేశారు. మీరు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు' అని అగ్ర కథానాయకుడు వెంకటేశ్ నమ్మకం వెలిబుచ్చారు. ఆయన హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఆదర్శకుటుంబం: హౌస్ నెం 47 -- AK 47'. శ్రీనిధిశెట్టి కథానాయిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా ఈసినిమాలోని తొలి పాట 'నారాయణమ్మ..'ను మేకర్స్ విడుదల చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ 'వెంకటేశ్‌గారి 'పవిత్రబంధం' సినిమాతో నా సినీప్రయాణం మొదలైంది. 'నువ్వునాకు నచ్చావ్'తో మా బంధం బలపడింది.



# అంగరంగ వైభవంగా గణనాథుని నిమజ్జనం

- బండ్లగూడలో చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

- మహిళల హారతులు.. భక్తుల జయజయధ్వానాలతో సాగిన శోభాయాత్ర

-రూ.1.20 లక్షలు పలికిన గణేష్ లడ్డూ.. 24 ఏళ్లుగా కొనసాగుతున్న ఉత్సవాలు



కీసర( ప్రశ్న న్యూస్) కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని బండ్లగూడ కాలనీలో చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ చతుర్థి ఉత్సవాల నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నిమజ్జనానికి ముందు మహిళలు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల మధ్య గణనాథుని శోభాయాత్ర నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రూ.1.20 లక్షలకు వేలం పలికిన గణేష్ లడ్డూను భక్తులు ప్రత్యేక ఆకర్షణగా పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలు విజయవంతంగా 24 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చైతన్య యూత్ అసోసియేషన్ సభ్యులు కాలనీవాసులకు, ఉత్సవాలకు సహకరించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గత 24 సంవత్సరాలుగా గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. భక్తులు, యువత, మహిళల భాగస్వామ్యంతో నిమజ్జన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.

# కుటుంబ కలహాలతో భర్త హత్య..

# భార్య, ఆమె తండ్రికి జీవిత ఖైదు

## నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు, సిబ్బందికి అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అభినందనలు

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్: కుటుంబ కలహాల నేపథ్యంలో వెంకటేష్‌ను చిత్రహింసలకు గురిచేసి హత్య చేసిన కేసులో నిందితులైన భార్య విజయ, ఆమె తండ్రి నర్సింలుకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పు వెలువరించినట్లు మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ వివరాల్లోకి వెళ్తే.. ఘనపూర్‌కు చెందిన దొడ్ల వెంకటేష్ (38) తన భార్య విజయ, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా కుటుంబ విషయాలపై భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. 01.09.2023న రాఖీ పండుగ సందర్భంగా విజయ తండ్రి నర్సింలు, ఇతర బంధువులతో కలిసి వెంకటేష్ ఇంటికి వచ్చారు. అదే రోజు రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో వెంకటేష్‌ను కొబ్బరి తాళ్లు, చున్నీతో కట్టేసి దాడి చేశారు. అనంతరం అతడిపై వేడి నీళ్లు పోసి గదిలో ఉంచి తాళం వేశారు.ఈ విషయాన్ని విజయ ఫోన్ ద్వారా వెంకటేష్ తమ్ముడికి తెలియజేయడంతో రామంతాపూర్‌కు చెందిన శ్రీనివాస్ ఘనపూర్‌కు చేరుకుని గది తాళం పగలగొట్టి వెంకటేష్‌ను బయటకు తీసుకొచ్చాడు. అనంతరం తూప్రాన్ ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ వెంకటేష్ మృతి చెందాడు.వెంకటేష్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి తూప్రాన్ ఎస్ఐ శివానందం కేసు నమోదు చేశారు. అప్పటి తూప్రాన్ సీఐ, దర్యాప్తు అధికారి శ్రీధర్ సమగ్ర దర్యాప్తు చేపట్టి కీలక సాక్ష్యాధారాలను సేకరించారు. కేసు విచారణ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. ప్రస్తుత దర్యాప్తు అధికారి వెంకట రాజాగౌడ్, ఎస్ఐ గంగరాజు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితులు విజయ, నర్సింలుకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసులో నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, పకడ్బందీగా సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ప్రవేశపెట్టిన అధికారులు, సిబ్బందిని అదనపు ఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్



అభినందించారు. నేరం చేసిన నిందితులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విట్టల్, కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్, సీడీఓ నాగరాజు సహకరించినట్లు అదనపు ఎస్పీ తెలిపారు.

# రాష్ట్ర స్థాయి రోలర్ స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో కుశాల్‌కు కాంస్య పతకం




కీసర (ప్రశ్న న్యూస్) 3వ తెలంగాణ స్టేట్ ర్యాంకింగ్ రోలర్ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో బండ్లగూడకు చెందిన వై. కుశాల్ సత్తా చాటాడు. 10-12 సంవత్సరాల బాలుర విభాగంలో నిర్వహించిన 500 మీటర్ల రేసులో కాంస్య పతకం సాధించి ప్రతిభ కనబరిచాడు.ఈ పోటీల్లో ఫస్ట్ రైడ్ స్కేటింగ్ అకాడమీ, బండ్లగూడ నుంచి పలువురు స్కేటర్లు పాల్గొన్నారు. వారిలో తీర్థ నాగ సాయి రెడ్డి, జోయన్నా, విఖ్యాత్, దేవాన్ష్, కియాన్ష్, గీరిష్మా, విశ్రిత్, ఆల్వెన్ తదితరులు ఉన్నారు. కుశాల్ కాంస్య పతకం సాధించడంపై ఫస్ట్ రైడ్ స్కేటింగ్ అకాడమీ నిర్వాహకులు, కోచ్‌లు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు నశా ముక్త్ యువ భారత్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలను తెలిపారు.దేశాన్ని మాదకద్రవ్యాల (డ్రగ్స్) రహితంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జాతీయ ఉద్యమమే "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్". ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2026 ఆగస్టు 2న ప్రారంభించారు. అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) లక్ష్య సాధనలో యువతను భాగస్వాములను చేయడం, వారిని వ్యసనాలకు దూరంగా ఉంచడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టడం, వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం,యువకులలో ఆరోగ్యకరమైన జీవనశైలిలో మార్పులకైవారిలో సృజనాత్మకను డెవలప్ చేయడం, క్రీడలు, సంస్కృతి, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడం ఈ ప్రోగ్రాం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. కాబట్టి యువకులు ఆరోగ్యంగా వుండాలని, ఆరోగ్యవంతమైన విద్యార్థులు సమాజానికి, దేశానికి వరమని, యువకులలో నైతిక విలువలు పెరగాలని, క్రమశిక్షణ అభివృద్ధికి నిచ్చెన మెట్టని, చదువే విద్యార్థికి ముఖ్య ఉద్దేశ్యంగా వుండాలని, చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా వుండాలని, తల్లిదండ్రులు పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకొని, తినీతినక, పస్తులుండి, అప్పులు చేసి చదివిస్తున్నారని, విద్యార్థులు మంచి క్రమశిక్షణతో వుండి వున్నత చదువులు చదవాలని, డ్రగ్స్,మత్తు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడవద్దని, మంచి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని, ఒక్కసారి డ్రగ్స్ కు అలవాటు పడితే పూర్తిగా దానికి బానిసలై పోతారని, శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా చాలా నష్టపోతారని, ప్రతి ఒక్కరు ఏదో ఒకటి



సాధించడానికి పుట్టారని, విద్యార్థులు విలువైన జీవితాన్ని జీవించాలని, ఏది సాధించాలన్నా విద్యార్థుల యవ్వన దశే కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ తెలిపారు. చివరగా విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ (Pledge) చేయించారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

### 70 గ్రాముల గంజాయి స్వాధీనం..

### నిందితుడిని అరెస్ట్ చేసిన నాచారం పోలీసులు



నాచారం(ప్రశ్న న్యూస్) గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మల్లాపూర్ జనప్రియ లేన్ సమీపంలోని బాలాజీ ధాబా ఎదురుగా, ఎంఎస్ బిర్యానీ షాప్ వద్ద నాచారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వచ్చిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద 14 ప్యాకెట్లలో సుమారు 70 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు.పోలీసులు నిందితుడిని ముకేష్ చోహన్ (33)గా గుర్తించారు. దాదన్ నోనియా కుమారుడైన ముకేష్ చోహన్ కన్‌స్ట్రక్షన్ లేబరర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మల్లాపూర్‌లోని భవానీ నగర్, ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్నాడని, స్వస్థలం బీహార్ రాష్ట్రంలోని కైమూర్ (భబువా) జిల్లా సోన్వాన్ గ్రామమని పోలీసులు పేర్కొన్నారు.నిందితుడి వద్ద నుంచి 14 ప్యాకెట్లలో ఉన్న సుమారు 70 గ్రాముల గంజాయిని, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై నాచారం పోలీసులు ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు.నిందితుడిని అరెస్ట్ చేసి వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, నిల్వ, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను గుర్తించి యువత వాటికి దూరంగా ఉండాలని, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసినవారు పోలీసులకు సమాచారం అందించాలని నాచారం పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జగిత్యాల జిల్లా చైర్మన్ గా ఎన్నికైన డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి



మానవతా సేవలకు మరింత ప్రాధాన్యత – జిల్లాలో సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి

జగిత్యాల(ప్రశ్న న్యూస్)ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జగిత్యాల జిల్లా శాఖ చైర్మన్ గా డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా శాఖ నూతన పాలకవర్గం ఏర్పాటులో భాగంగా ఆయనను చైర్మన్ గా ఎన్నుకున్నారు.జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేసి, అవసరమైన ప్రజలకు మానవతా దృక్పథంతో సేవలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు నూతన చైర్మన్ డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

### రక్తదాన కార్యక్రమాలకు ప్రాధాన్యత..

ప్రజల ప్రాణాలను కాపాడడంలో రక్తదానం ఎంతో కీలకమని, యువతను పెద్దఎత్తున రక్తదాన కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలను విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

### విపత్తుల సమయంలో సేవలు..

ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు రెడ్ క్రాస్ సొసైటీ మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు చేపడతామని డా. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ రెడ్ క్రాస్ సేవలను విస్తరించి, సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, యువత, సామాజిక కార్యకర్తలను భాగస్వామ్యం చేయనున్నట్లు చెప్పారు.

### ప్రజలకు చేరువగా రెడ్ క్రాస్..

రెడ్ క్రాస్ సొసైటీ కేవలం అత్యవసర సమయాల్లోనే కాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేలా సేవా కార్యక్రమాలను రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆరోగ్యం, రక్తదానం, విపత్తు నిర్వహణ, మానవతా సేవలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి జిల్లా చైర్మన్ గా ఎన్నిక కావడం పట్ల రెడ్ క్రాస్ సభ్యులు, సామాజిక సేవా కార్యకర్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో జగిత్యాల జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

# సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వ లే అవుట్ భూములను కేటాయించాలి

### తహాశీల్దార్ కు వినతి పత్రం సమర్పించిన సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం ప్రతినిధులు



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) వెంకటాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం భవనం నిర్మాణానికి, ఉద్యానవనానికి ప్రభుత్వ స్థలాలను గ్రామపంచాయతీ లేఅవుట్ స్థలాలను కేటాయించాలని, ఎల్లారెడ్డిపేట తహాశీల్దార్ దివ్య జ్యోతి కి వినతిపత్రం సమర్పించారు.
వెంకటాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం లో 200 మంది సభ్యులు ఉన్నారు. సమావేశాలు నిర్వహించుకోవడానికి వృద్ధాశ్రమం నిర్మించుకోవడానికి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 349లో 0-23 గుంటలు, 374 సర్వే నెంబర్లు 0-29 గుంటలు, 396 సర్వేనెంబర్ లో భూమి లేని నిరుపేదలకు పట్టాలు ఇవ్వగా మిగిలిన భూమి భవన నిర్మాణానికి కేటాయించాలని చెట్ల కింద కూర్చోవడానికి ఉద్యానవనం అవసరమున్నదని, గ్రామపంచాయతీకి కేటాయించిన లేఔట్ భూముల నుండి ఖాళీ స్థలం కేటాయించాలని సీనియర్ సిటిజన్ అధ్యక్షులు కొంపెల్లి నర్సయ్య, జనరల్ సెక్రెటరీ మునిగే చంద్రయ్య, వైస్ ప్రెసిడెంట్ మామిండ్ల లక్ష్మి, జయింట్ సెక్రటరీ గోట్టే ఎల్లయ్య, ట్రెజరర్ పొన్నాల రాజయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ దుండిగాల నర్సయ్య, పోన్నాల లింగయ్య, వడ్నాల ఎల్లయ్య, గొట్టే దేవయ్య లు వినతి పత్రం అందజేశారు.

# జనసేనలోకి మిద్దెల హరి, సత్రవాడ ప్రవీణ్



శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి రాజకీయాల్లో కీలక పరిణామం పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న నేతలు శ్రీకాళహస్తి :నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసిన మాజీ ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్, మాజీ ఆప్కో డైరెక్టర్, శ్రీకాళహస్తి మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ మిద్దెల హరి, టీడీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు సత్రవాడ ప్రవీణ్ జనసేన పార్టీలో చేరారు. సెప్టెంబరు 25న ఉపముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో వీరిద్దరూ జనసేన కండువాలు కప్పుకున్నారు.ఈ సందర్భంగా మిద్దెల హరి మాట్లాడుతూ. వైఎస్సార్‌సీపీలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చుట్టూ ఉన్న కొన్ని శక్తుల కారణంగా తాను ఇబ్బందులు ఎదుర్కొన్నానని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలు, ఆశయాలకు ఆకర్షితుడై జనసేనలో చేరినట్లు తెలిపారు.పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి నాయకులు, జనసేన సీనియర్ నాయకులతో కలిసి పనిచేస్తామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అభ్యర్థుల విజయానికి సమష్టిగా కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు.త్వరలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో భారీ సభ నిర్వహించనున్నట్లు హరి తెలిపారు. స్థానిక రాజకీయాల్లో ఈ చేరికల ప్రభావం ఎలా ఉంటుందన్నది రానున్న రోజుల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# సీఈసీ నిర్ణయాలకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన

### జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్

### సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షా రెడ్డి

గజ్వేల్ (ప్రశ్న న్యూస్) ఓట్ల చోరీ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తీసుకున్న నిర్ణయాలకు నిరసనగా, ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షా రెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీరుపాక శ్రీనివాస్ రెడ్డి, సర్దార్ ఖాన్,ఉడేం సారిక శ్రీనివాస్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



# ఖైరతాబాద్ బైపోల్.. గెలుపు ప్రతిష్ఠ, ఓటమి భారీ మూల్యం

- రేవంత్ ప్రభుత్వ పనితీరుకు ఉపఎన్నిక కీలక పరీక్ష- బీఆర్ఎస్‌కు పునరాగమన సంకేతాల కోసం ఎదురుచూపు
- హైదరాబాద్‌లో బలం చాటుకునేందుకు బీజేపీకి మరో అవకాశం- మూడు పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారిన ఖైరతాబాద్ ఉపపోరు

**"దానం నాగేందర్ అనర్హతతో ఖాళీ అయిన ఖైరతాబాద్.. రేవంత్, కేసీఆర్, కిషన్‌రెడ్డికి ఇది కేవలం ఒక్క సీటు పోరు కాదు. మూడు పార్టీలకు ప్రతిష్ఠాత్మక పోటీ కాంగ్రెస్‌కు ప్రభుత్వ పనితీరుకు పరీక్ష, బీఆర్ఎస్‌కు పునరాగమనానికి సంకేతం, బీజేపీకి హైదరాబాద్‌లో బలం చాటుకునే అవకాశం"**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఖైరతాబాద్‌లో ఎమ్మెల్యే సీటు ఖాళీ అయింది కానీ రాజకీయ పోరు ఎప్పుడో మొదలైంది. దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడంతో ఖైరతాబాద్ ఉపఎన్నికకు మార్గం సుగమమైంది. తాజాగా తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లోనూ ఖైరతాబాద్ సీటు ఖాళీగా ప్రకటించారు. 2024 ఏప్రిల్ 23 నుంచి ఈ ఖాళీ అమల్లోకి వచ్చినట్లు నోటిఫికేషన్ పేర్కొంది. ఇప్పుడు అసలు ప్రశ్న ఉపఎన్నిక ఎప్పుడు అన్నది మాత్రమే కాదు. ఖైరతాబాద్‌లో ఎవరు గెలుస్తారు అన్నదానికంటే ఎవరి రాజకీయ బలానికి ఈ ఎన్నిక ఏ సంకేతం ఇస్తుంది? అన్నదే అసలు ఆసక్తి. ఎందుకంటే ఇది హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న నియోజకవర్గం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మూడు పార్టీలకూ ఇక్కడ రాజకీయ చరిత్ర ఉంది. 2023లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా 67,368 ఓట్లు సాధించగా కాంగ్రెస్‌కు చెందిన పి. విజయారెడ్డికి 45,358, బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డికి 38,094 ఓట్లు వచ్చాయి. అంటే ముగ్గురికీ గణనీయమైన ఓటు బేస్ ఉంది. అందుకే ఖైరతాబాద్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాలకు సెమీ ఫైనల్గా మారుతోంది.

### - దానం అనర్హత.. కోర్టు తీర్పుతో కొత్త ఆట

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. 2024లో కాంగ్రెస్‌లో చేరారు. అదే సమయంలో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఫిరాయింపుపై బీఆర్ఎస్ నేతలు న్యాయపోరాటం చేశారు.తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న దానం నాగేందర్‌ను పదవికి అనర్హుడిగా ప్రకటించింది. ఆయన 2024 ఏప్రిల్ 23 నుంచి ఎమ్మెల్యేగా అనర్హుడని, ఫలితంగా ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించినా సెప్టెంబర్ 24న సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి కారణం లేదని స్పష్టం చేస్తూ ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉపఎన్నికకు మార్గం క్లియర్ అయింది. దానం ఎమ్మెల్యేగా మాత్రమే అనర్హుడు పోటీకి కాదు. కోర్టు తీర్పు తనను ప్రస్తుతానికి మాత్రమే అనర్హుడిని చేసిందంటూ దానం మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని ఇప్పటికే సంకేతం ఇచ్చారు. కానీ ఏ పార్టీ టికెట్‌పై పోటీ చేస్తారన్నది మాత్రం ఇంకా స్పష్టంగా చెప్పలేదు.

### - ఖైరతాబాద్ ఎందుకు ఇంత కీలకం.?

ఖైరతాబాద్ అంటే కేవలం ఒక అసెంబ్లీ నియోజకవర్గం కాదు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, హిమాయత్‌నగర్ వంటి ఖరీదైన, ఉన్నత వర్గాల ప్రాంతాలతో పాటు మధ్యతరగతి కాలనీలు, బస్తీలు కూడా ఈ నియోజకవర్గంలో ఉన్నాయి. అందుకే ఇక్కడి ఓటింగ్ ప్యాటర్న్ కూడా ఒకే వర్గానికి పరిమితం కాదు. 2014లో బీజేపీకి చెందిన చింతల రామచంద్రారెడ్డి గెలిచారు. 2018లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున తిరిగి గెలిచారు. 2023లోనూ బీఆర్ఎస్ సీటును నిలబెట్టుకుంది. మూడు ఎన్నికల్లోనూ విజేతలు 50 శాతానికి మించి ఓట్లు సాధించలేదు. దీంతో ఖైరతాబాద్‌లో పోటీ ఎంత ఓపెన్‌గా ఉంటుందో అర్థమవుతుంది.

### - ఇప్పుడు మరో ఆసక్తికరమైన అంశం.. ఎస్ఐఆర్

2026 ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ తర్వాత ఖైరతాబాద్‌లో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. గతంలో సుమారు 2.68 లక్షలుగా ఉన్న ఓటర్ల సంఖ్య ఇప్పుడు 1.86 లక్షలకు తగ్గింది. నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు గణనీయంగా ఉండటంతో పాటు 30 వేలకు పైగా రెడ్డి ఓట్లు ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. బీసీ, ఎస్సీ ఓటర్లు కూడా పలు ప్రాంతాల్లో కీలకంగా ఉన్నారు. అంటే ఎస్ఐఆర్ తర్వాత జరుగుతున్న తొలి కీలక ఉపఎన్నికల్లో ఖైరతాబాద్ కూడా ఒకటిగా నిలవనుంది. కొత్త ఓటర్ల జాబితా, కొత్త రాజకీయ లెక్కలు, పాత పార్టీల బలం, కొత్త సమీకరణాలు. అందుకే ఈ ఉపఎన్నికపై ఆసక్తి మరింత పెరిగింది.

### - రేవంత్‌రెడ్డి నాయకత్వానికి మరో పరీక్ష.?

ఖైరతాబాద్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న పార్టీగా బరిలోకి దిగనుంది. దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. మళ్లీ కాంగ్రెస్ ఆయనకు టికెట్ ఇస్తుందా? లేక కొత్త అభ్యర్థిని రంగంలోకి దింపుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్‌కు ఈ ఎన్నిక రెండు రకాలుగా ప్రతిష్ఠాత్మకం. ఒకటి – అధికారంలో ఉన్న పార్టీగా హైదరాబాద్‌లో తన బలాన్ని ఎంతవరకు నిలబెట్టుకుంది.? రెండు – ఫిరాయింపుల ద్వారా ఏర్పడిన రాజకీయ పరిణామాలకు ప్రజా తీర్పు ఏం చెబుతుంది? ఒకవేళ దానం మళ్లీ కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేస్తే అది వ్యక్తిగత రాజకీయ పునరాగమనంగా కూడా మారుతుంది. కొత్త అభ్యర్థిని బరిలోకి దింపితే.. కాంగ్రెస్‌కు కొత్త రాజకీయ ప్రయోగం అవుతుంది.అందుకే అభ్యర్థి ఎంపిక కూడా ఎన్నికంతే కీలకంగా మారింది.

### - కేసీఆర్, కేటీఆర్‌కు ఇదొక రికవరీ టెస్ట్.?

బీఆర్ఎస్‌కు ఖైరతాబాద్ మరింత ప్రత్యేకం. ఎందుకంటే 2023లో గెలిచిన సీటును పార్టీ ఫిరాయింపు కారణంగా కోల్పోయింది. ఇప్పుడు అదే నియోజకవర్గంలో మళ్లీ ప్రజల తీర్పు కోరాల్సి వస్తోంది. అందుకే బీఆర్ఎస్‌కు ఇది "సీటు తిరిగి సాధించుకోవడం" కంటే ఎక్కువ. హైదరాబాద్‌లో పార్టీ రాజకీయ బలం ఇంకా ఉందని చూపించాల్సిన వేదికగా మారింది. బీఆర్ఎస్‌లో తలసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు సాయికిరణ్ యాదవ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేరు కూడా చర్చలో ఉంది. సాయికిరణ్‌కు మరో ప్రత్యేకత ఉంది. ఖైరతాబాద్ ఉన్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా ఆయన పనిచేస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికలో స్థానిక నెట్‌వర్క్, కుటుంబ రాజకీయ ప్రభావం, గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ పునర్నిర్మాణం వంటి అంశాలు కీలకంగా మారుతున్నాయి.

### - బీజేపీకి హైదరాబాద్‌లో బలం చూపించే అవకాశం

బీజేపీ కూడా ఖైరతాబాద్‌ను తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. 2014లో ఈ నియోజకవర్గాన్ని బీజేపీ గెలుచుకుంది. ఆ ఎన్నికలో చింతల రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
2023లో ఆయన మళ్లీ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. అయినా హైదరాబాద్‌లో బీజేపీ ఓటు బేస్‌ను చూస్తే ఖైరతాబాద్ ఆ పార్టీకి కీలకమైన నియోజకవర్గమే. ఇక 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఖైరతాబాద్ పరిధిలో బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి సుమారు 17 వేల ఓట్ల ఆధిక్యం రావడం కూడా పార్టీ లెక్కల్లో ఒక అంశంగా ఉంది. లోక్‌సభలో కనిపించిన బలం అసెంబ్లీ ఉపఎన్నికలోకి మార్చగలమా? అన్న ప్రశ్నకు ఈ ఎన్నిక పరీక్ష.

### - దానం నాగేందర్.. అసలు సస్పెన్స్ ఇక్కడే

ఈ మొత్తం రాజకీయ కథలో అత్యంత ఆసక్తికరమైన పాత్ర మాత్రం దానం నాగేందర్‌దే. అనర్హత తర్వాత కూడా మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తానని ఆయన స్పష్టం చేశారు. కానీ ఏ పార్టీ టికెట్ తో? పార్టీలు మారడం దానం కి కొత్త కాదు అభ్యర్థిని మాత్రం నేనే, గెలుపు నాదే అంటున్నారు. వాస్తవానికి కాంగ్రెస్, బీఆరెస్, బీజేపీ మూడు పార్టీల్లోనూ దానం అంతటి స్ట్రాంగ్ కాండిడేట్ లేరు. ఇండిపెండెంట్ గా దానం అంత స్ట్రాంగ్ కాదు. అందుకే దానం అడుగులు ఎటు ఏపార్టీనుంచి అనేది కూడా ఆసక్తే.

### - ఎంఐఎం ఎటు వైపు.?

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో మాదిరిగానే ఖైరతాబాద్‌లోనూ ఎంఐఎం కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే అవకాశం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే అధికారిక ఎన్నికల సమయానికి ఏర్పడే రాజకీయ సమీకరణాలను బట్టి పరిస్థితి మారవచ్చు. ముస్లిం ఓటర్లు గణనీయంగా ఉన్న నియోజకవర్గంలో ఈ మద్దతు అంశం రాజకీయ లెక్కల్లో ప్రాధాన్యం సంతరించుకోవచ్చు.

### - కవిత పార్టీ పోటీ చేస్తే ఆమె ప్రచారం ఎవరికి నష్టం, ఎవరికి ఇష్టం.??

కల్వకుంట్ల కవితకు చెందిన తెలంగాణ రక్షణ సమితి కూడా ఉపఎన్నికలో పోటీ చేస్తామని ప్రకటించింది. ఫిరాయింపుల రాజకీయాలపై కవిత ఇప్పటికే కాంగ్రెస్‌ను విమర్శించారు. ఈ పార్టీ బరిలోకి దిగితే అయితే ఏ పార్టీ కి పడే కొద్దో గొప్పో ఓట్లు ఏపార్టీ పై దాని ప్రభావం ఎంత ఉంటుందనేది చూడాలి. పైగా ఆమె పార్టీకి వచ్చే ఓట్లకంటే కవిత తన విమర్శలద్వారా ఎవరిని టార్గెట్ చేస్తారన్నది కూడా ఓ పరోక్ష ఫాక్టర్ అవుతుంది.

### - ఇంతకీ ఎన్నిక ఎప్పుడు.?

సాధారణంగా అసెంబ్లీ ఖాళీని ఆరు నెలల్లో భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే ఖైరతాబాద్ విషయంలో సీటు ఖాళీగా ప్రకటించిన తేదీ, కోర్టు ప్రక్రియ, ఎన్నికల సంఘం షెడ్యూల్ వంటి అంశాల కారణంగా అసలు ఎన్నికల టైమ్‌లైన్‌పై అధికారిక ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంది. ఐతే ఒక్క అసెంబ్లీ స్థానంకోసం కేంద్ర ఎన్నికల సంఘం ఎప్పుడూ ప్రత్యేక కసరత్తు చేయదు. దగ్గర్లో ఉండే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఉపఎన్నికలూ నిర్వహిస్తారు. కాబట్టి ఆరు నెలల నిబంధనను 2024 నుంచి కాకుండం తాజాగా పరిగణిస్తే మాత్రం 2027 ఫిబ్రవరిలో లో జరిగే పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలతోపాటు జరిగే అవకాశం లేకపోలేదు.

**ఒక విషయం మాత్రం స్పష్టం. ఎన్నికల షెడ్యూల్ రాకముందే మూడు ప్రధాన పార్టీలూ ఖైరతాబాద్‌లో రాజకీయ కసరత్తు మొదలు పెట్టేశాయి. అన్ని పార్టీలకూ అత్యంత ప్రతిష్టాత్మంకంగా మారిన ఈ ఉపఎన్నిక తెలంగాణలో తదుపరి రాజకీయ పంథాలను నిర్ణయించనుందని మాత్రం చెప్పొచ్చు.**

## ఓటుకు నోటు కేసులో

# సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

- రూ. 50 లక్షల ఈడీ అటాచ్‌మెంట్‌ను రద్దు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) 2015 నాటి సంచలనాత్మక 'ఓటుకు నోటు' కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భారీ ఊరట లభించింది. ఈ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీ చేసిన రూ. 50 లక్షల ఆస్తుల జప్తు (అటాచ్‌మెంట్) ఉత్తర్వులను అప్పిలేట్ ట్రైబ్యునల్ రద్దు చేసింది. రేవంత్ రెడ్డితో పాటు ఈ కేసులోని ఇతర నిందితులకు కూడా అనుకూలంగా ఈ తీర్పు వెలువడింది. జస్టిస్ మునీశ్వర్ నాథ్ భండారీ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 14న ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కేసులో స్వాధీనం చేసుకున్న రూ. 50 లక్షల నగదును ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సీజ్ చేసి, ట్రయల్ కోర్టులో జమ చేసిందని పిటిషనర్లు తమ వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ట్రైబ్యునల్, వివాదాస్పద నగదు ఇప్పటికే కోర్టు అధీనంలో ఉన్నప్పుడు, దానికి సమానమైన మరో మొత్తాన్ని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జప్తు చేయడం చెల్లదని స్పష్టం చేసింది. నిందితులు ఆ ఆస్తులను బదిలీ చేసే అవకాశం లేనందున ఈడీ అటాచ్‌మెంట్ అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది. 2015లో రేవంత్ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో, ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ఈ కేసు నమోదైంది. నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ. 5 కోట్ల ఒప్పందంలో భాగంగా రూ. 50 లక్షల అడ్వాన్స్ ఇవ్వజూపారనే ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. ఆ రూ. 50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ తెలిపింది. ఈ ఏసీబీ కేసును ఆధారంగా చేసుకునే ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి ఆస్తులను అటాచ్ చేసింది. ఈడీ అటాచ్‌మెంట్‌ను ఖరారు చేస్తూ 2022లో వెలువడిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, వేం కృష్ణ కీర్తన్, రుద్ర శివకుమార్, ఉదయ్ సింహా, బిషప్ హ్యారీ సెబాస్టియన్ అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం తాజాగా వారికి అనుకూలంగా తీర్పు వెలువడింది.

# టీజీపీఎస్సీ పరీక్షల షెడ్యూల్ విడుదల

- అక్టోబర్, నవంబర్ నెలల్లో పరీక్షల నిర్వహణ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని నిరుద్యోగులకు కీలక సమాచారం. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పరీక్షల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. లక్షలాది మంది అభ్యర్థులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పలు కీలక పోస్టులకు సంబంధించిన పరీక్షల తేదీలను టీజీపీఎస్సీ ప్రకటించింది. విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పరిధిలోని అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టులకు అక్టోబర్ 24న, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు అక్టోబర్ 26న పరీక్షలు నిర్వహించనున్నారు. అదేవిధంగా, ఆర్ అండ్ బీ శాఖలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టులకు నవంబర్ 6, 7 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. పాఠశాల విద్యాశాఖకు చెందిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి నవంబర్ 12, 13 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయని టీజీపీఎస్సీ వెల్లడించింది. ఈ షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

# ఉజ్జయినిలో ఉద్రిక్తత..

## షాహీ మసీదు కూల్చివేతపై ఘర్షణ

- ఉజ్జయిని షాహీ మసీదు పాక్షిక కూల్చివేత ప్రతిపాదనపై ఉద్రిక్తత
- సింహస్థ్ 2028 ఏర్పాట్లలో భాగంగా రోడ్డు వెడల్పు పనులపై వివాదం
- ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ, రాళ్ల దాడి
- నిరసనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయువు ప్రయోగం
- కూల్చివేతను సవాలు చేసిన పిటిషన్లను కొట్టివేసిన మధ్యప్రదేశ్ హైకోర్టు



**ఉజ్జయిని(ప్రశ్న న్యూస్) :** మధ్యప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉజ్జయినిలో సోమవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. రోడ్డు వెడల్పు పనుల కోసం చారిత్రక షాహీ మసీదును పాక్షికంగా కూల్చివేయాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ స్థానికులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ తలెత్తింది. ఆందోళనకారులు భద్రతా సిబ్బందిపై రాళ్లు రువ్వడంతో పరిస్థితి అదుపుతప్పింది. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టేందుకు బాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. 2028లో జరగనున్న సింహస్థ్ మహా పర్వదినం కోసం ఉజ్జయినిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను అధికారులు చేపట్టారు. ఇందులో భాగంగా కాంతల్ స్క్వేర్ నుంచి గోపాల్ మందిర్ వరకు ఉన్న రహదారిని 15 మీటర్లకు విస్తరించాలని నిర్ణయించారు. అయితే, ఈ ప్రణాళిక ప్రకారం శతాబ్దాల చరిత్ర కలిగిన షాహీ మసీదుకు చెందిన కొన్ని భాగాలు తొలగించాల్సి వస్తోంది. దీనిని స్థానిక ముస్లిం సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ చారిత్రక కట్టడాన్ని కూల్చడానికి వీల్లేదని వారు వాదిస్తున్నారు. ఈ కూల్చివేతకు వ్యతిరేకంగా మున్సిపల్ నోటీసులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను మధ్యప్రదేశ్ హైకోర్టులోని ఇండోర్ ధర్మాసనం ఇదివరకే కొట్టివేసింది. ప్రజా ప్రయోజనాలు, ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా విస్తరణ అవసరమని కోర్టు పేర్కొంది. ఈ కేసులో నేడు మరోసారి విచారణ జరగాల్సి ఉండగా, ఈ ఆందోళనలు చోటుచేసుకోవడం గమనార్హం. తాజా ఘర్షణల నేపథ్యంలో మసీదు ప్రాంగణం చుట్టూ భారీగా పోలీసులను మోహరించారు. ముందుజాగ్రత్త చర్యగా 'రాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) బలగాలను కూడా రంగంలోకి దించారు. ఈ తోపులాటలో ఒక పోలీస్ అధికారికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

# పేపర్ ప్లేట్లతో ఆరోగ్యానికి ముప్పు.?

- వేడివేడి ఆహారాన్ని ఆహారాన్ని ప్లాస్టిక్ ప్లేట్లలో తింటే క్యాన్సర్ తప్పదా.?
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్, నిబంధనలకు విరుద్ధమైన డిస్పోజబుల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి
- తయారీపై నిషేధం లేకుండా వినియోగంపై ఉచిత సలహాలేనా.?




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** వేడివేడి ఆహారాన్ని పేపర్ ప్లేట్లు, డిస్పోజబుల్ పాత్రల్లో వడ్డించే విధానం ప్రజారోగ్యంపై ఆందోళనకు దారితీస్తోంది. పేపర్ ప్లేట్లు పూర్తిగా కాగితంతో తయారైనవేననే భావన ఉన్నప్పటికీ వాటి పైన ప్లాస్టిక్ పేపర్ ఉండటంతో కొన్ని రకాల ప్లేట్లలో నీరు, నూనె, వేడి ఆహారాన్ని తట్టుకునేందుకు పూతలు, అంటుకునే పదార్థాలు లేదా ఇతర రసాయన పదార్థాలు ఉపయోగించడం జరుగుతుంది. అధిక ఉష్ణోగ్రతలు, కొవ్వు అధికంగా ఉండే ఆహారంతో సంపర్కం జరిగినప్పుడు ప్యాకేజింగ్ పదార్థాల నుంచి కొన్ని రసాయనాలు ఆహారంలోకి కలిసే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకించి హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లు, ఆలయాలు, జాతరలు, నవరాత్రి, గణేష్ ఉత్సవాలు, వివాహాలు, ఇతర సామూహిక కార్యక్రమాల్లో డిస్పోజబుల్ ప్లేట్లు, కప్పుల వినియోగం భారీగా పెరుగుతోంది. ఒకసారి ఉపయోగించి పడేసే ఈ వస్తువులు చెత్తగా పేరుకుపోవడంతో పారిశుధ్య సమస్యలతో పాటు పర్యావరణంపై కూడా ప్రభావం పడుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు, ఇతర జంతువులు తినే ప్రమాదం ఉండటంతో జంతువుల ఆరోగ్యంపైనా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### స్టీల్ పాత్రలే పునర్వినియోగానికి మార్గం..

వేడివేడి ఆహారాన్ని వడ్డించేందుకు పునర్వినియోగించగల స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, ఇతర పాత్రలను వినియోగించడం ద్వారా డిస్పోజబుల్ వ్యర్థాలను గణనీయంగా తగ్గించవచ్చని ప్రజలు సూచిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో 'స్టీల్ బ్యాంక్' తరహాలో పాత్రలను అందుబాటులో ఉంచి సామూహిక కార్యక్రమాలకు వినియోగించే విధానాలు అమలవుతున్నాయి. ఇలాంటి విధానాలను గ్రామాలు, పట్టణాలు, మున్సిపాలిటీల్లో విస్తరించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### తయారీపై చర్యలెప్పుడు.?

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు తరచూ పిలుపునిస్తూనే ఉన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనేక అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, 'ప్లాస్టిక్ వాడొద్దు' అంటూ ప్రజలకు సూచనలు చేయడం జరుగుతోంది. అయితే వినియోగాన్ని నియంత్రించాలంటే నిబంధనలకు విరుద్ధంగా తయారవుతున్న, సరఫరా అవుతున్న వస్తువులపై కూడా సమర్థవంతమైన చర్యలు అవసరమనే అభిప్రాయాలు ప్రజల నుండి వ్యక్తమవుతున్నాయి. సర్పంచ్ నుంచి ముఖ్యమంత్రి వరకు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని చెబుతున్నప్పుడు, నిబంధనలకు విరుద్ధమైన ప్లాస్టిక్ వస్తువుల తయారీ, సరఫరాపై కఠిన చర్యలు ఎప్పుడు తీసుకుంటారన్న ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది. తయారీదారులు, సరఫరాదారులపై నియంత్రణ లేకుండా కేవలం వినియోగదారులకు సలహాలు ఇవ్వడం వల్ల సమస్య ఎప్పటికీ పరిష్కారం కాదని పలువురు పేర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలో కిరాణా దుకాణాలు, టీ హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార విక్రయ కేంద్రాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, ప్లేట్లు, ఇతర డిస్పోజబుల్ వస్తువులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పునర్వినియోగ పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588